ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
కాకినాడ జిల్లా వార్తలు
సోమవారం 17 ఫిబ్రవరి 2025 | 5





రెండో రోజు హోరాహోరీ


పోటీల్లో తలపడుతున్న క్రీడాకారులు

కాకినాడ జిల్లా క్రీడా మైదానంలో ఆల్ ఇండియా సివిల్ సర్వీసెస్ హాకీ టోర్నమెంట్ రెండో రోజైన ఆదివారం హోరాహోరీగా సాగింది. ఆర్ఎస్బీ హైదరాబాద్, ఆర్ఎస్బీ ముంబై, ఆర్ఎస్బీ రాయ్‌పూర్, ఛత్తీస్‌గఢ్ సెక్రటేరియట్, తెలంగాణ, ఢిల్లీ సెక్రటేరియట్, ఒడిశా సెక్రటేరియట్, మహారాష్ట్ర సెక్రటేరియట్ జట్లు విజయం సాధించాయి. సాయంత్రం జరిగిన సాంస్కృతిక ప్రదర్శనల్లో శ్రీకృష్ణ కోలాటం ఎంతో ఆకట్టుకుంది. శ్రీభరత్ లిఖిత ఆర్కెస్ట్రా, ఆర్ టెక్నో రాక్ బ్యాండ్ క్రీడాకారులకు వినోదాన్ని పంచాయి.

వివరాలు 7లో...



ఆకట్టుకున్న కోలాటం

పట్టు కోసం!

- నేడు తుని మున్సిపల్ వైస్ చైర్మన్ ఎన్నిక
- పదవి దక్కించుకునేందుకు ఇరు పార్టీల పట్టు బిగింపు
- బలం కూడగట్టుకునే యత్నాల్లో టీడీపీ
- ఉన్న 16 మందినీ కాపాడుకునే పనిలో వైసీపీ
- తునిలో వేడెక్కిన రాజకీయం

తుని రూరల్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): కొంత కాలంగా ఉత్కంఠరేపుతున్న తుని మున్సిపల్ వైస్ చైర్మన్ ఎన్నిక సోమవారం తుని మున్సిపల్ కార్యాలయ కౌన్సిల్ హాల్లో జరగనుంది. ఉద్రిక్త పరిస్థితుల మధ్య ఇప్పటికే రెండుసార్లు వాయిదాపడిన ఈ ఎన్నికను హైకోర్టు ఆదేశాలతో ఈసారి పకడ్బందీగా నిర్వహించేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. టీడీపీ, వైసీపీ అధిష్ఠానాలు ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని ప్రత్యేక దృష్టి సారించినట్టు తెలుస్తోంది. ఏది ఏమైనా పట్టు నిలుపుకోవాలని భావిస్తున్న రెండు పార్టీలు కౌన్సిలర్లకు ద్వారాలు తెరిచాయి. ఈ నేపథ్యంలో కొంత కాలంగా వైసీపీలో అసంతృప్తితో రగులుతున్న పది మంది కౌన్సిలర్లు టీడీపీ తీర్థం పుచ్చుకోవడంతో వైసీపీకి గట్టి షాకే తగిలింది. సంఖ్యా బలానికి దగ్గరగా ఉన్న టీడీపీ ఎలాగైనా వైస్ చైర్మన్ పదవి దక్కించుకుని మున్సిపాల్టీపై పసుపు జెండా ఎగరేసేందుకు సిద్ధం చేసుకున్నట్టు తెలుస్తోంది. తమ సంఖ్య బలానికి మించి కౌన్సిలర్లు మద్దతు ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నారని టీడీపీ తుని పట్టణ శాఖ అధ్యక్షుడు ఇనుగంటి సత్యనారాయణ బాంబు పేల్చడంతో వైసీపీ షాక్‌కు గురైంది. ఉన్న 16 మంది కౌన్సిలర్లను కాపాడుకుని ఎలాగైనా పైచేయి సాధించాలని వైసీపీ క్యాంపు రాజకీయాలకు తెరదీసింది. వారందరినీ సుదూర ప్రాంతాలకు తరలించింది. ఎన్నికల సమయానికి నేరుగా కౌన్సిల్ హాలుకు వైసీపీ కౌన్సిలర్లను తరలించాలని భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో రాజకీయ వాతావరణం వేడెక్కింది. ఉత్కంఠభరిత పరిణామాల నేపథ్యంలో ఎవరు పై చేయి సాధిస్తారో వేచి చూడాలి.

మొర.. వినరా!


గ్రీవెన్స్‌లో సమస్యలు వివరిస్తున్న అర్జీదారులు

- జిల్లాలో ప్రజల నుంచి వచ్చే గ్రీవెన్స్‌సెల్ దరఖాస్తులకు మోక్షమెప్పుడో
- నెలల తరబడి కాళ్లరిగేలా తిరుగుతున్నా శ్రద్ధపెట్టని వివిధ శాఖలు
- కూటమి ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి ఇప్పటివరకు 25,134 అర్జీలు రాక
- ఇన్ని నెలల్లో పరిష్కరించినవి 15,537.. అపరిష్కృత అర్జీలు 9,163
- అత్యధికంగా సర్వే శాఖకు సంబంధించి 11,843 దరఖాస్తులు రాక
- వీటిలో ఇప్పటివరకు పరిష్కారానికి నోచుకోని అర్జీలు 6,187
- రెవెన్యూశాఖకు సంబంధించి 7,699 దరఖాస్తులకు పెండింగ్ 2,780
- ప్రత్యేకంగా పిఠాపురంలో నిర్వహించిన గ్రీవెన్స్‌కు వచ్చిన అర్జీలు 6,837
- వీటిలో ఇంకా 2,777 అర్జీలు పెండింగ్..
- పరిష్కరించినట్టు లెక్కలు
- గ్రీవెన్స్‌సెల్ సమస్యలను పరిష్కరించాలని సీఎం పదేపదే చెబుతున్నా అశ్రద్ధే

జిల్లాలో వారానికోసారి నిర్వహించే గ్రీవెన్స్ సెల్‌కు అర్జీలతో వస్తున్న ప్రజలకు నిరాశే ఎదురవుతోంది. నెలలకు నెలలు గడుస్తున్నా ఇచ్చిన అర్జీలకు దిక్కుమొక్కు ఉండకపోవడంతో జనం ఉసూరుమంటున్నారు. ఇచ్చిన అర్జీనే పదేపదే ఇస్తున్నా రెవెన్యూ, సర్వే, పోలీసు శాఖల్లో పెద్దగా చలనం లేక నెత్తీనోరు బాదుకుంటున్నారు. ఒకపక్క వచ్చిన ప్రతి అర్జీని పరిశీలించి న్యాయం చేయాలని సీఎం చంద్రబాబు పదేపదే మొత్తుకుంటున్నా కొందరు అధికారుల్లో మాత్రం చలనం ఉండడం లేదు. దీంతో వారం వారం గ్రీవెన్స్‌సెల్‌కు దరఖాస్తులు కుప్పలు తెప్పలుగా రావడమేగానీ పెద్దగా పరిష్కారానికి నోచుకోవడం లేదు. ముఖ్యంగా రెవెన్యూ, సర్వే, పోలీసు శాఖలకు వస్తున్న అర్జీలు మాత్రం కదలడం లేదు. దీంతో బాధితులు అధికారుల చుట్టూ కాళ్లరిగేలా తిరుగుతున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఇప్పటివరకు ఎనిమిదిన్నర నెలల్లో మొత్తం 25,134 అర్జీలు వస్తే ఇంతవరకు 9,163 అర్జీలు అసలు పరిష్కారమే కాలేదు.

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

జిల్లావ్యాప్తంగా అనేకమంది ప్రజలు వివిధ సమస్యలపై కలెక్టరేట్‌తోపాటు ఆయా మండలాల్లోని తహశీల్దార్ కార్యాలయాలకు ప్రతి సోమవారం నిర్వహించే గ్రీవెన్స్‌సెల్‌కు వస్తుంటారు. తమ సమస్యను వివరిస్తూ అధికారులకు అర్జీలు పెట్టుకుంటున్నారు. వీటిలో అనేక ప్రభుత్వ శాఖలకు సంబంధించిన సమస్యలు వస్తుంటాయి. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గ్రీవెన్స్‌సెల్‌ను ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంది. వచ్చిన ప్రతి అర్జీని పరిశీలించి ప్రజలకు సత్వర న్యాయం చేయాలని కలెక్టర్లను ఆదేశించింది. అటు గ్రీవెన్స్‌సెల్ పేరును ప్రజా సమస్యల పరిష్కార వ్యవస్థ (పీజీఆర్ఎస్)గా నామకరణం చేసింది. వచ్చే అర్జీలు పెండింగ్‌లో పడిపోకుండా ప్రభుత్వ ఉన్నతస్థాయిలోను అధికారులు పర్యవేక్షిస్తున్నారు. అటు సీఎం చంద్రబాబు సైతం ప్రత్యేకంగా దృష్టిసారించి సమీక్ష జరుపుతున్నారు. ప్రధానంగా కూటమి అధికారంలోకి వచ్చిన జూన్ 15 నుంచి ఇప్పటివరకు కాకినాడ జిల్లావ్యాప్తంగా కలెక్టరేట్, తహశీల్దార్ కార్యాలయాలకు కలిపి మొత్తం 25,134 అర్జీలు ప్రజల నుంచి వచ్చాయి. ఒకరకంగా ఈ సంఖ్య చాలా భారీగానే అని చెప్పాలి. వీటిలో అత్యధికంగా జిల్లా సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ శాఖకు సంబంధించే 11,843 అర్జీలు పోటెత్తాయి. వాస్తవానికి ఈ శాఖ తరఫున ప్రజలకు పెద్దగా ఎప్పుడూ సమస్యలు ఉండవు. కానీ గత వైసీపీ ప్రభుత్వ హయాంలో చేపట్టిన జగనన్న భూసర్వే మూలంగా ప్రజలకు అనేక చిక్కులు తలెత్తాయి. సర్వేలో అనేక తప్పులు దొర్లి ప్రజలకు సంబంధించి వారి భూముల విస్తీర్ణం అనేక చోట్ల తగ్గిపోయింది. కొందరి భూములు అయితే కొత్త సర్వేలో అసలు కనిపించకుండా పోయాయి. భూముల సరిహద్దులు మారిపోయాయి. ఒకరకంగా భూసర్వే మొత్తం కంగాళీ అయిపోయింది. వీటిని పరిష్కరించాలని అప్పట్లో ప్రజలు గ్రీవెన్స్‌సెల్‌కు అర్జీలు ఇచ్చినా గత జగన్ సర్కారు పట్టించుకోలేదు. అయితే కూటమి ప్రభుత్వం రావడంతో బాధితులంతా వేలల్లో క్యూకట్టడంతో గ్రీవెన్స్‌సెల్‌కు 11,843 ఫిర్యాదులు వచ్చాయి. అయితే అనూహ్య తాకిడితో ఆ శాఖ అధికారులు వీటిని పరిష్కరించలేకపోతున్నారు. అరకొర సిబ్బంది, రెవెన్యూ తరఫు నుంచి సిబ్బంది అందుబాటులో లేకపోవడం, ఈ చిక్కులు వేగంగా తెగే పరిస్థితి లేకపోవడంతో అపరిష్కృత అర్జీలు ఇంకా 6,187 వరకు పేరుకుపోయాయి. అయితే ఈ శాఖకు వచ్చిన మొత్తం అర్జీల్లో 5,656 అర్జీలు పరిష్కరించినట్టు చెబుతున్నా వీటిలో చాలా అర్జీలను మండలాల స్థాయికి పంపించి పరిష్కారమైపోయినట్టు లెక్కలు చూపిస్తున్నారు. అలాగే రెవెన్యూ శాఖకు సంబంధించి మొత్తం 7,699 అర్జీలు రాగా, వీటిలో పట్టాదారు పాసు పుస్తకాలు లేవని కొందరు, మీ భూమిలో తప్పుడు వివరాలు నమోదవడం, ఒకే ఎల్‌పీ నెంబరుపై వందలాది మందికి ఒకే విస్తీర్ణం చూపించడం, మ్యుటేషన్లపై ఫిర్యాదులు వచ్చాయి. వీటిలో ఇప్పటివరకు పరిష్కరించినవి 4,919కాగా, ఇంకా 2,780 అర్జీలు అపరిష్కృతంగా ఉన్నాయి. ఇవి ఎప్పటికి పరిష్కారమవుతాయో చెప్పలేని పరిస్థితి. అటు రెవెన్యూ అధికారులేమో రకరకాల పనిఒత్తిడితో వీటి పరిష్కారంపై పెద్దగా దృష్టి సారించడం లేదు. మరోపక్క పోలీసుశాఖకు ఇప్పటివరకు 1,488అర్జీలు వస్తే వీటిలో 24 మాత్రమే పరిష్కరించాల్సి ఉందని లెక్కలు చూపుతున్నారు. కానీ బాధితులు మాత్రం న్యాయం కోసం తిరుగుతూనే ఉన్నాయి. అలాగే మున్సిపల్ శాఖకు 823, పంచాయతీరాజ్‌శాఖకు 795, పౌరసరఫరాలశాఖకు 260, విద్యుత్‌శాఖ 223, మిగిలినశాఖలకు వందల్లో అర్జీలు వచ్చాయి. ఇలా కూటమి ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి ఇప్పటివరకు 25,134 అర్జీలు రాగా, ఇందులో 15,537 అర్జీలు పరిష్కారమైపోగా, అపరిష్కృత అర్జీలు 9,163గా ఉన్నట్టు అధికారులు చెబుతున్నారు. దీంతో బాధితులకు న్యాయం ఎప్పుడు జరుగుతుందో అర్థంకాని పరిస్థితి. ఇక అర్జీల్లో చాలావరకు మండలాల్లో ఆయా శాఖలకు పంపించి జిల్లా స్థాయి రికార్డుల్లో వాటిని పరిష్కరించేసినట్టు పరిష్కారం జాబితాలో చూపిస్తున్నారు. కానీ బాధితులకు మాత్రం న్యాయం జరగడం లేదు. మరోపక్క కలెక్టర్ల సదస్సులోను, ఇటీవల అధికారులతో నిర్వహించిన సమీక్షలో పీజీఆర్ఎస్ ఫిర్యాదులపై అధికారులు ప్రత్యేక దృష్టిసారించి పరిష్కరించాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు. కానీ జిల్లాలో ఆయాశాఖల్లో మాత్రం వేగంగా అధికారులు కదలడం లేదు. వారం వారం కొత్త అర్జీలు వస్తుండడంతో వీటిని పరి ష్కరించాల్సిన అధికారులు పాత అర్జీలను దాదాపు పక్కన పడేస్తున్నారు. ఈ నేపథ్యంలో ప్రధానంగా సర్వే, రెవెన్యూ శాఖలపై కలెక్టర్ ప్రత్యేక సమీక్ష వారం వారం నిర్వహిస్తే అర్జీల పరిష్కారం కొంతైనా ముందుకు కదులుతుంది.



పిఠాపురంలో అలా..

డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ నియోజకవర్గమైన పిఠాపురంలో జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ ప్రత్యేకంగా దృష్టిసారించి అక్కడ గ్రీవెన్స్ సెల్ నిర్వహించారు. స్వయంగా కొన్నిసార్లు కలెక్టర్ హాజరై అక్కడికక్కడే పలు అర్జీలను పరిష్కరించారు. అయితే ఇప్పటివరకు ఇక్కడ నిర్వహించిన పీజీఆర్ఎస్‌లో మొత్తం 6,837 అర్జీలు రాగా, ఇంకా 2,777 అర్జీలు పరిష్కారం కాలేదు. దీంతో బాధితులు మళ్లీ మళ్లీ గ్రీవెన్స్‌కు వస్తున్నారు. మరోపక్క పవన్ సైతం తన నియోజకవర్గంలో వస్తున్న అర్జీల గురించి ఆరా తీస్తూ వాటి పరిష్కారానికి కలెక్టర్‌కు ఆదేశాలు ఇస్తున్నారు. అయితే రెవెన్యూ, సర్వేశాఖలకు సంబంధించి కొంతవరకు అర్జీల పరిష్కారం కదలడం లేదు. అయితే కొన్ని అర్జీలు వ్యక్తిగత సమస్యలకు సంబంధించి ఉండడంతో వాటిని ఏంచేయాలో తెలియక తల పట్టుకుంటున్నారు. పవన్ పిఠాపురం వచ్చినప్పుడు గ్రీవెన్స్‌సెల్ ఫిర్యాదులపై ఆరా తీస్తే చాలావరకు పరిష్కరించామని చెప్పారు.


కార్డెన్ సెర్చ్ ఆపరేషన్‌కు సమాయత్తమైన పోలీసులు

కాకినాడలో కార్డెన్ సెర్చ్

కాకినాడ క్రైం, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): కాకినాడ నగరంలో గత కొన్ని రోజులుగా సాక్ష్యాధారాలు లేని హత్యలు, దొంగతనాలు అధికంగా జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో ఎస్పీ జి.బిందుమాధవ్ ఆదేశానుసారం కాకినాడ ఎస్‌డీపీవో (ఏఎస్పీ) మనీష్ దేవరాజ్ పాటిల్ ఆధ్వర్యంలో ఆదివారం తెల్లవారుజామున కార్డెన్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగి అస్తవ్యస్తంగా తయారవుతున్న నేపథ్యంలో పోర్టు పోలీస్ స్టేషన్ పరిధిలో ఈ ఆపరేషన్ నిర్వహించారు. పోర్టు సీఐ సునీల్, టూటౌన్ సీఐ మజ్జి అప్పలనాయుడు, పోలీసులు, ప్రత్యేక బృందాలతో కలిసి 12 వ డివిజన్ స్వర్ణాంధ్ర కాలనీలోని టిడ్కో గృహాల మధ్య అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నందున ఆయా ఇళ్లల్లో ఆకస్మిక సోదాలు చేశారు. రికార్డులు లేని పలు ద్విచక్ర వాహనాలను సీజ్ చేశారు. ఎటువంటి అసాంఘిక కార్యకలాపాలకు తావు లేకుండా శాంతి భద్రతల పరిరక్షణే లక్ష్యంగా పని చేస్తామని, సాధారణ ప్రజలకు ఎటువంటి ఇబ్బంది తలెత్తకుండా స్వేచ్ఛగా తిరగడమే లక్ష్యంగా పోలీస్ సిబ్బంది పని చేయాలని ఎస్‌డీపీవో మనీష్ దేవరాజ్ పాటిల్ కోరారు. కార్డెన్ సెర్చ్ ఆపరేషన్‌లో సుమారు 70 మంది పోలీసులు పాల్గొన్నారు.


విశేష అలంకరణలో భావనారాయణస్వామి (పైన) దర్శించుకుంటున్న భక్తులు (కింద)



వైభవంగా భావనారాయణస్వామి తిరునాళ్లు

మాఘ మాసం మూడో ఆదివారం తిరునాళ్లు, స్వామి జన్మదినోత్సవం కలిసి రావడంతో సర్పవరంలోని శ్రీరాజ్యలక్ష్మీ సమేత శ్రీభావనారాయణస్వామి దర్శనానికి భక్తులు పోటెత్తారు. ఉభయ తెలుగు రాష్ట్రాలతో పాటు కర్ణాటక, మహారాష్ట్ర నుంచి సుమారు 50వేల మంది భక్తులు తరలివచ్చారు. స్వామివారికి ప్రీతిపాత్రమైన ఆవు పిడకల పొయ్యిపై ఆవు పాలతో పాల పొంగలి వండి నైవేద్యం సమర్పించారు. వివిధ విభాగాల ద్వారా ఒక్కరోజు ఆదాయం రూ.5లక్షలు వచ్చిందని ఈవో లక్ష్మీనారాయణ తెలిపారు.... 7లో

రూ.9వేల కోట్లతో కాకినాడలో ఎల్ఎన్‌జీ ఇంపోర్ట్ టెర్మినల్

ఎంపీ ఉదయ్‌శ్రీనివాస్ వెల్లడి

కలెక్టరేట్ (కాకినాడ), ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా పని చేస్తున్న కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్ కృషితో కాకినాడకు భారీ ప్రాజెక్టు మంజూరైంది. సీపోర్టు, డీప్‌వాటర్ పోర్టుల్లో ఎగుమతులు, దిగుమతులతో అభివృద్ధి చెందుతున్న కాకినాడ పోర్టులో ఎల్ఎన్‌జీ ఇంపోర్ట్ టెర్మినల్ నెలకొల్పేందుకు నార్వే సంస్థ ముందుకు వచ్చిందని ఉదయ్‌శ్రీనివాస్ ఆదివారం మీడియాకు తెలిపారు. నార్వేకు చెందిన క్రౌన్ ఎల్ఎన్‌జీ సంస్థ రూ.9వేల కోట్ల భారీ పెట్టుబడితో గ్యాస్ ఇంపోర్ట్ టెర్మినల్ నెలకొల్పుతుందని ఆయన వివరించారు. ఈ టెర్మినల్ ప్రపంచంలో రెండవది, ఆసియాలో మొదటిది అని చెప్పారు.



2025-26 ఆర్థిక సంవత్సరానికి రూ.162.55 కోట్లతో అన్నవరం ఆలయ అంచనా బడ్జెట్

...వివరాలు 7లో

బర్డ్‌ఫ్లూ కలకలం!

గొల్లప్రోలు మండలం చెందుర్తిలో కోళ్లఫారంలో

- 1,500కి పైగా కోళ్లు మృత్యువాత
- సమాచారం ఇవ్వని నిర్వాహకుడు

...మెయిన్‌లో



చేపల చెరువుల్లోకి కోళ్ల వ్యర్థాలు

కిర్లంపూడి, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో గల చేపల చెరువుల్లో కోళ్ల వ్యర్థాలను యథావిధిగా వేస్తున్నారు. వేలంకలోని చెరువుల్లో కోళ్ల వ్యర్థాలను చేపలకు మేతగా వేశారు. దీనిపై గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చెరువుల యజమానులు మాత్రం వ్యర్థాలతోనే చేపల పెంపకాలు కొనసాగిస్తున్నారని ఆరోపిస్తున్నారు. ప్రభుత్వ అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

సత్యదేవుడి సన్నిధిలో

సుప్రీంకోర్టు, హైకోర్టు న్యాయమూర్తుల పూజలు




సుప్రీంకోర్టు న్యాయమూర్తికి సత్యదేవుడి చిత్రపటం అందజేస్తున్న ఈవో, సత్యదేవుడి దర్శనానంతరం హైకోర్టు న్యాయమూర్తి సురేష్‌రెడ్డి

అన్నవరం, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన సత్యదేవుడి సన్నిధిలో సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ జె.కె.మహేశ్వరి, హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సురేష్‌రెడ్డి కుటుంబ సభ్యులతో వేర్వేరుగా స్వామిని దర్శించుకుని ప్రత్యేకపూజలు నిర్వహించారు. వారికి ఆలయ ఈవో వీర్లసుబ్బారావు ఆలయ మర్యాదలతో పూర్ణకుంభ స్వాగతంపలికారు. దర్శనానంతరం వేదపండితులు వేదాశీర్వచనాలు అందజేశారు. పీఆర్వో కృష్ణారావు పాల్గొన్నారు.

2025-26కి రూ.162.55 కోట్లతో

అన్నవరం ఆలయ అంచనా బడ్జెట్

అన్నవరం, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన సత్యదేవుడి ఆలయానికి సంబంధించి 2025-26 ఆర్థిక సంవత్సరానికి రూ.1625525000 అంచనా ఆదాయం వస్తోందని లెక్కించారు. అయితే వ్య యానికి సంబంధించి రూ.1621325000 వ్యయంగా అంచనా వేశారు. ఆదాయానికి సంబంధించి వ్రతాల ద్వారా రూ.50కోట్లు, ప్రసాదాల విక్రయాల ద్వారా రూ.40కోట్లు, లీజుల విభాగం ద్వారా రూ.15 కోట్లు, సత్రంగదుల అద్దెల ద్వారా రూ.10కోట్లు, ఫిక్స్‌డ్ డిపాజిట్లపై వడ్డీలద్వారా రూ.6కోట్లు అంచనా ఆదాయంగా లెక్కించారు.

ఖ్యయాలకు సంబంధించి ప్రధానంగా ఉద్యోగుల జీతభత్యాలు, రిటైర్డ్ ఉద్యోగుల పెన్షన్లు, శానిటేషన్ నిర్వహణ, రసవర్గాలు కొనుగోలుకు నెలకు రూ.12 కోట్లు ఖర్చుచేయాల్సి ఉండగా వీటికే ఏడాదికి సుమారు రూ.140 కోట్లు వరకు వ్యయమవుతుంది. మొత్తంమీద రానున్న ఆర్థిక సంవత్సరంలో స్వామివారి ఖజానాకు సుమారు రూ.42లక్షలు మాత్రమే మిగులు బడ్జెట్‌గా అంచనా వేశారు. ఈ అంచనా బడ్జెట్ దేవదాయ కమిషనర్ ఆమోదం మేరకు హెచ్చుతగ్గులు ఉండే అవకాశం ఉన్నట్లు ఆలయ అధికారులు వెల్లడించారు.

పెరుగుతున్న గోదావరి నీటి మట్టం

● డెల్టా కాలువలకు 8500 క్యూసెక్కులు విడుదల

ధవళేశ్వరం, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): గోదావరి నీటిమట్టం నెమ్మదిగా పెరుగుతోంది. నీటిమట్టం తగ్గిపోతుండడంతో సీలేరు నుంచి పవర్ జనరేషన్ ద్వారా వచ్చే 4వేల క్యూసెక్కులతోపాటు నేరుగా మరో 3వేల క్యూసెక్కులను విడుదల చేస్తున్నారు. దీంతో 9.40 అడుగులకు తగ్గిన నీటిమట్టం ఆదివారం నాటికి 9.55 అడుగులకు పెరిగింది. నీటిలభ్యత 8654 క్యూసెక్కులుగా ఉండగా డెల్టాకాలువకు 850 0 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. తూర్పుడెల్టాకు 2600క్యూసెక్కులు, మధ్యడెల్టాకు 1600 క్యూసెక్కులు, పశ్చిమడెల్టాకు 4300 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.

కెనరా బ్యాంకులో కొనసాగుతున్న విచారణ

● బ్యాంకు అధికారుల ఫిర్యాదుతో గోల్డ్ అప్రైజర్‌పై కేసు నమోదు

తునిరూరల్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): గ్రామీణరైతులనే లక్ష్యంగా చేసుకుని కొదవుపెట్టిన కోటికి పై బడి బంగారాన్ని గోల్‌మాల్ చేసిన వ్యవహారం తీవ్ర దుమారం రేపుతోంది. ఇప్పటికే ఖాతాదారులు బ్యాంకు చుట్టూ తిరుగుతూ ఆందోళన చేస్తున్నారు. ఈ నేపథ్యంలో బ్యాంక్ అధికారులు గోల్డ్‌లోన్ వ్యవహారంలో అవకతవకలకు పాల్పడిన ముగ్గురు సిబ్బందిని సస్పెం డ్ చేసి తుని రూరల్ పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేయగా తేటగుంట కెనరా బ్యాంకులో గోల్డ్ గోల్‌మాల్‌లో సూత్రధారిగా ఉన్న గోల్డ్ అప్రైజర్ రామోజీల శేఖర్‌పై కేసు నమోదు చేసినట్లు తుని రూరల్ ఎస్‌ఐ కృష్ణమాచార్యులు తెలిపారు. ఇదిలావుంటే బాధితులపక్షాన తుని ఎంపీపీ బొప్పన రాము బ్యాంకుకు చేరుకుని అధికారులతో చర్చలు జరిపారు. బంగారం కోల్పోయిన ఖాతాదారులకు ప్రస్తుత బంగారం మార్కెట్‌కు అనుగుణంగా పరిహారం చెల్లించాలని బ్యాంక్ అధికారులను కోరారు.

రెండోరోజు జోష్



● హోరాహోరీగా హాకీ టోర్నమెంట్ ● ఆర్‌ఎస్సీ హైదరాబాద్, ముంబై, రాయ్‌పూర్, చత్తీస్‌గడ్ సెక్రటేరియట్, తెలంగాణ, ఢిల్లీ, ఒడిసా, మహారాష్ట్ర జట్ల విజయం



కలెక్టరేట్(కాకినాడ), ఫిబ్రవరి 16(ఆంధ్ర జ్యోతి): కాకినాడజిల్లా క్రీడా మైదానంలో జరుగుతున్న ఆల్ ఇండియా సివిల్ సర్వీసెస్ హాకీ టోర్నమెంట్ రెండోరోజు ఆదివారం టోర్నమెంట్ హోరాహోరీగా సాగింది. తొలుత ఆర్‌ఎస్సీ హైదరాబాద్, ఆర్‌ఎస్సీ కొచ్చి జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో ఆర్‌ఎస్సీ హైదరాబాద్ 8-1తేడాతో ఆర్‌ఎస్సీ కొచ్చిపై విజయం సాధించింది. ఆర్‌ఎస్సీ చండీఘర్, ఆర్‌ఎస్సీ ముంబై జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో ఆర్‌ఎస్సీ ముంబై 5-1 తేడాతో ఆర్‌ఎస్సీ చండీఘర్‌పై విజయం సాధించింది. అలాగే ఆర్‌ఎస్సీ సిమ్లా, ఆర్‌ఎస్సీ రాయ్‌పూర్ జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో ఆర్‌ఎస్సీ రాయ్‌పూర్ జట్టు 6-2తేడాతో ఆర్‌ఎస్సీ సిమ్లాపై విజయం సాధించింది. చత్తీస్‌ఘడ్ సెక్రటేరియట్, గుజరాత్ సెక్రటేరి యట్ జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో చత్తీస్‌ఘడ్ సెక్రటేరియట్ జట్టు 13-0తేడాతో గుజరాత్ సెక్రటేరి యట్ జట్టుపై విజయం సాధించింది. మధ్యప్రదేశ్, తెలంగాణ జట్లమధ్య జరిగిన మ్యాచ్‌లో తెలంగాణ జట్టు 4-3తేడాతో మధ్యప్రదేశ్ జట్టుపై విజయం సాధించింది. కేరళ సెక్రటేరియట్ జట్టు, ఢిల్లీ సెక్రటేరి యట్ మధ్య జరిగిన మ్యాచ్‌లో ఢిల్లీ సెక్రటేరియట్ జట్టు 9-0తేడాతో కేరళ సెక్రటేరియట్ జట్టుపై విజయం సాధించింది. పాండిచ్చేరి సెక్రటేరియట్ జట్టు, ఒడిసా సెక్రటేరియట్ జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో ఒడిసా సెక్రటేరియట్ జట్టు 6-0తేడాతో పాండిచ్చేరి జట్టుపై విజయం సాధించింది. గోవా సెక్రటేరియట్ జట్టు, మహారాష్ట్ర సెక్రటేరియట్ జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో మహారాష్ట్ర సెక్రటేరియట్ జట్టు 18-0తేడాతో గోవా సెక్రటేరియట్ జట్టుపై విజయం సాధించింది. కార్యక్రమంలో డీఎస్‌డీవో శ్రీనివాసకుమార్, హాకీ కోచ్ రవిరాజు పాల్గొన్నారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

కలెక్టరేట్ (కాకినాడ), ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): కాకినాడజిల్లా క్రీడామైదానంలో జరుగుతున్న హాకీ టోర్నమెంట్ కార్యక్రమంలో భాగంగా ఆదివారం సాయంత్రం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా అలరించాయి. శ్రీకృష్ణ కోలాటం బృం దం ఎంతో ఆకట్టుకుంది. అలాగే శ్రీభరత్ లిఖిత ఆర్కెస్ట్రా, ఆర్ టెక్నో రాక్ బ్యాండ్‌లు నిర్వహించిన కార్యక్రమాలు క్రీడాకారులకు ఎంతో వినోదాన్ని అందించాయి.





హోరాహోరీగా జరుగుతున్న హాకీ పోటీలు



సాంస్కృతిక ప్రదర్శన నిర్వహిస్తున్న దృశ్యం

2028లో నేషనల్ గేమ్స్‌కి కాకినాడ వేదిక కావాలి



దాసరి మురళీకృష్ణ ఇన్‌కంట్యాక్స్ తెలంగాణ

1999 2001 వరకు 36 అంతర్జాతీయ టోర్నమెంట్లు ఆడారు. భారతదేశం తరుపున హాకీ టోర్నమెంటులో పాల్గొన్నా. 2028లో జరగనున్న నేషనల్ ఒలింపిక్స్‌కి ఏపీ ప్రభుత్వం ఆతిథ్యం ఇవ్వాలని మొగ్గుచూపుతుంది. అదే జరిగితే కాకినాడ వేదికగా నిలవాలని అందుకు అనువైన గ్రౌండ్ ఇక్కడ ఉంది. ఎక్సో టర్ఫ్ గ్రౌండ్ జాతీయ అంతర్జాతీయ టోర్నమెంట్లకు అనువైన గ్రౌండ్ అందుకు అనుకూలంగా క్లబ్ లైట్స్ గ్యాలరీ ఏర్పాటుకు చీక్రీడా స్ఫూర్తితో కలెక్టర్ షణ్మోహన్ సగిలి 8.50 కోట్లు కేటాయించడంతో హాకీ క్రీడాకారులకు ఎంతో ఉప యోగకరంగా మారింది. గతంతో హాకీ క్రీడాకారులు ఇటువంటి గ్రౌండ్‌లో ప్రాక్టీస్ కోసం హైదరాబాద్ వెళ్లాల్సి వచ్చేది. ఇప్పుడు కాకినాడలో అందు బాటులో ఉంది. భవిష్యత్ క్రీడాకారులకు ఇది ఎంతో శుభపరిణామం.

హాకీ టోర్నీ కాకినాడలో జరగడం గర్వకారణం

● రవిచంద్రప్రసాద్ కడియాల ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఇన్‌కంటాక్స్ కోకనాడ కోస్టల్ స్పోర్ట్స్ క్లబ్ ఫౌండర్



రవిచంద్రప్రసాద్ కడియాల

కార్పొరేషన్(కాకినాడ),ఫిబ్రవరి(ఆంధ్రజ్యోతి): ఆలిండియా సర్వీసెస్ హాకీ టోర్నీకి వివిధ రాష్ట్రాల నుంచి విచ్చేసిన 44 జట్లు కాకినాడలో ఆడడం చాలా గర్వకారణం. ప్రభుత్వ సహకారంతో పాటు జిల్లా కలెక్టర్ హాకీ టోర్నమెంట్‌కు అనుకూలమైన గ్రౌండ్ తయారుచేయడానికి నిధులు కేటాయించడంతో ఇదంతా సాధ్యమైంది. జాతీయ, అంతర్జాతీయస్థాయి హాకీ టోర్నమెంట్‌కు ఈ గ్రౌండ్ ఎంతో ఉప యోగకరంగా ఉంటుంది. కాకినాడలో పుట్టిపెరిగిన నేను హాకీ బ్యాట్ ప ట్టుకుని 1986 నుంచి 1989 వరకు అనేక జాతీయస్థాయి టోర్నమెంట్లు ఆడాను. తెలంగాణ హాకీ ఇన్‌కంట్ ట్యాక్స్ టీమ్‌గా న్యూఢిల్లీ ఇంటర్‌నేషనల్ టీమ్‌గా పని చేసున్నా. హాకీ మీద ఉన్న అభిమానంతో కాకినాడలోనే కోకనాడ కోస్టల్ స్పోర్ట్స్ క్లబ్ ఏర్పాటు చేసి 25మంది అమ్మాయిలు, 25మంది అబ్బాయిలను క్లబ్ తరుపున దత్తత తీసుకుని వారికి కావాల్సిన కిట్లు ఏర్పాటుచేసి సౌకర్యాలు కల్పించి మెరుగైన హాకీ క్రీడాకారులుగా తీర్చిదిద్దే బాధ్యత తీసుకున్నాం.



బ్యాలెట్ బాక్సుల వినియోగంపై శిక్షణలో పీవో, ఏపీవోలు (ఫైల్‌ఫొటో)

ఎమ్మెల్సీ ఎన్నికకు రెడీ

» మిగిలింది 10 రోజులే
» 6 జిల్లాల్లో పట్టభద్రులు సిద్ధం
» 456 పోలింగ్ కేంద్రాలు
» 2 వేల మంది విధులు
» 22న తుది విడత శిక్షణ

ఏలూరు, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): ఉభయ గోదావరి జిల్లాల్లో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు పోలింగ్ గడువు పది రోజులు లోపే ఉండడంతో ఎన్నికల నిర్వహణకు యంత్రాంగం కసరత్తులు చేస్తోంది. ఇప్పటికే ఒక విడత శిక్షణ పూర్తి.22న మరోసారి పీవో, ఏపీవోలు,ఇతర సిబ్బందికి శిక్షణలు పూర్తి చేయనున్నారు. మోడల్ కోడ్ అమల్లోకి వచ్చిన వెంటనే ఎన్నికల నిర్వహణకు జిల్లా అధికారులను నోడల్ అధికారులుగా నియమిస్తూ జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి ఉత్తర్వులను జారీ చేసిన విషయం తెలిసిందే.ఈ నెల 27న ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటలకు వరకు పోలింగ్ నిర్వహిస్తారు. దాదాపుగా 2 వేల పైబడి అధికార,సిబ్బంది ఎన్నికల విధులు నిర్వహించనున్నారు. 456 పోలింగ్ కేంద్రాల్లో ఒక పీవోతో పాటు ఏపీవో మరో ఇద్దరు సపోర్టింగ్ స్టాఫ్ విధుల్లో ఉండనున్నారు. ఆరు జిల్లాల్లో కలిపి మొత్తం 456 మంది ప్రిసైడింగ్ ఆఫీసర్లు, 456 మంది అసిస్టెంట్ ప్రిసైడింగ్ ఆఫీసర్లు, 456 మంది మైక్రో అబ్జర్వర్లు, 456 మంది వెబ్ కాస్టింగ్ చేయనున్నారు. పోలింగ్ సరళిని వెబ్‌కాస్టింగ్‌తో నిఘా పెట్టనున్నారు. అదనంగా 20 శాతం రిజర్వ్‌లో అధికారులు, సిబ్బంది కూడా ఎన్నికల విధులకు సిద్ధం అయ్యారు.ఆరు జిల్లాల పరిధిలో ఎన్నికలు జరుగుతుండడంతో ప్రతి జిల్లాలో పోలింగ్ సరళిని పర్యవేక్షించేందుకు 10 మంది జోనల్ ఆఫీసర్లు చొప్పున మండల లేదా, డిప్యూటీ తహశీల్దార్ కేడర్‌లోని అధికారులు పనిచేస్తారు.

26న పోలింగ్ సామగ్రి తరలింపు..

జిల్లా కేంద్రాల్లో 26న ఉదయం పోలింగ్ మెటీరియల్‌తో ఎన్నికల సిబ్బంది రూట్ ఆఫీసర్ల పర్యవేక్షణలో బస్సుల్లో బ్యాలెట్ బాక్సుల, ఇతర సామగ్రితో తరలివెళ్లనున్నారు. ఆయా జిల్లాల్లో డిస్ట్రిబ్యూషన్ కేంద్రాల వద్ద 25వ తేదీ రాత్రికే ఏర్పాట్లను ఆయా జిల్లా కలెక్టర్లు పూర్తి చేస్తారు. 27న తర్వాత పోలింగ్ పూర్తయ్యాక ఏలూరు సీఆర్‌ఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్‌కు పోలింగ్ కేంద్రాల వరుస ప్రకారం భద్రపరచనున్నారు.ఈ ప్రక్రియ అంతా పోలీస్ యంత్రాంగం ద్వారానే జరగనుంది.

ప్రకటనలకు ఆమోదం తప్పనిసరి

ఎన్నికల రిటర్నింగ్ అధికారి వెట్రిసెల్వి

ఎమ్మెల్సీ ఎన్నికలకు ఎలక్ట్రానిక్ మీడియాలో రాజకీయ ప్రకటలనకు తప్పనిసరిగా మీడియా సర్టిఫికేషన్ మోనటరింగ్ కమిటీ(ఎంసీఎంసీ) నుంచి ముందస్తు ఆమోదం పొందాల్సి ఉంటుందని ఎమ్మెల్సీ ఎన్నికల రిటర్నింగ్ అధికారి కె వెట్రిసెల్వి తెలిపారు.ఎలక్ట్రానిక్ మీడియాలో రాజకీయ ప్రకటనలు ప్రసారం చేయదలచిన తేదీకి కనీసం మూడు రోజుల ముందు సంబంధిత అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల ప్రవర్తనా నియామవళి ప్రకారం 25వ తేదీ సాయంత్రం 4 గంటకల్లా ప్రచారానికి తెరపడుతుందన్నారు.

యువకుడి కిడ్నాప్



దాడిలో గాయపడిన ఉమ్మిడి గోవిందు

● పిఠాపురం తీసుకువెళ్లి బీరు బాటిళ్లు, ఇనుపరాడ్లతో దాడి ● సిగరెట్లతో కాల్చి చిత్రహింసలు
● మానవతా దృక్పథంతో సాయం చేసినందుకు ఫలితం ● ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఘటన

గొల్లప్రోలు, ఫిబ్రవరి16(ఆంధ్రజ్యోతి): యువకుడిని కిడ్నాప్‌చేసి బీరు బాటిళ్లు, ఇనుపరాడ్లతో దాడి చేయడమేగాక సిగరెట్లుతో కాల్చి చిత్రహింసలకు గురిచేసిన సంఘటన ఆలస్యంగా ఆదివారం వెలుగులోకి వచ్చిం ది. దీనిపై పోలీసులు కేసు నమోదు చేశారు. కాకినాడ జిల్లా గొల్లప్రోలు పట్టణం దేవీనగరం ప్రాంతానికి చెందిన ఉమ్మిడి గంగాధర్ టైల్స్ పనిచేసుకుని జీవనం సాగిస్తూ ఉంటాడు. రోజు మాదిరిగానే ఈనెల 11వ తేదీన రాత్రి 10.30గంటల సమయంలో పని పూర్తి చేసుకుని సురేష్ కల్యాణ మండపం మీదుగా ఇంటికి వెళుతుండగా ఇరు వర్గాలు అక్కడ కొట్లాడుకుంటున్నాయి. ఈ ఘర్షణలో పిఠాపురం పట్టణంలోని రథాల పేటకు చెందిన వ్యక్తికి గాయాలయ్యాయి. అతన్ని మానవతా దృక్పథంతో నీరు అందిస్తుండగా రథాలపేటకు చెందిన చిన్న, పెద్ద, ఆకాష్, గొల్లప్రోలుకు చెందిన గణేష్, అంజి తదితరులు అతడిని బలవంతంగా పట్టుకుని మోటార్‌సైకిల్ లాక్కొని పిఠాపురం తీసుకువెళ్లారు. రథాల పేటలోని నిర్మానుష్య ప్రాంతానికి తీసుకువెళ్లి అక్కడ బీరు బాటిళ్లు, ఇనుపరాడ్లుతో విచక్షణా రహితంగా దాడిచేసి తీవ్రంగా గాయపరిచారు. వంటిపై సిగరెట్లు కాల్చి చిత్రహింసలకు గురిచేశారు. రాత్రంతా హింసించి గాయపరిచిన వారు గంగాధర్‌ను తీసుకువచ్చి గొల్లప్రోలు టోల్‌గేట్ వద్ద తెల్లవారుజాము సమయంలో పడవేశారు. మోటార్‌సైకిల్‌ను వారి వద్దే ఉంచుకోవడంతోపాటు అతని జేబులో ఉన్న రూ.3,800 లాక్కొన్నారు. అతను ఆసుపత్రిలో చికిత్స పొంది గొల్లప్రోలు పోలీసులకు ఫిర్యాదు చేశా రు. దీనిపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు గొల్లప్రోలు ఎస్‌ఐ రామకృష్ణ తెలిపారు.

పోలీసింగ్‌పై విమర్శలు

యువకుడిని కిడ్నాప్‌చేసి పిఠాపురం పట్టణంలో చిత్రహింసలకు గురిచేసిన సంఘటన పిఠాపురం నియోజకవర్గంలో సంచలనంగా మారింది. పిఠాపురంలో పోలీసింగ్ తీరుపై డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ బహిరంగంగానే తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఆ తర్వాత జిల్లా ఎస్పీ విక్రాంత్‌పాటిల్ బదిలీ కావడం, పోలీసులు పిఠాపురం పట్టణంలో తనిఖీలు, రాత్రిపూట గస్తీలంటూ కొద్దిరోజులు హడావుడి చేశారు. తర్వాత మరలా పోలీసింగ్ అంతంత మాత్రంగానే మారింది. రాత్రిపూట పోలీసులు గస్తీ తిరుగుతూ ఉంటే యువకుడిని కిడ్నాప్‌కు తీసుకువెళుతున్నప్పుడు లేదా అతనిని నిర్మానుష్య ప్రదేశంలో చిత్రహింసలకు గురిచేసినప్పుడు గుర్తించి కాపాడే వీలుండేదని పలువురు వాఖ్యానిస్తున్నారు. యువకుడిపై దాడి చేసిన వారు అందరూ మద్యంమత్తులో ఉన్నట్లు చెబుతున్నారు. ఈ తరహా సంఘటనలు వెలుగులోకి వచ్చిన తర్వాత పోలీసుల్లో అంతగా కదలిక కనిపించకపోవడం విస్మయానికి గురిచేస్తుంది.

4.3 కిలోల గంజాయి స్వాధీనం

● ముగ్గురి అరెస్టు

గండేపల్లి, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): ఏజెన్సీ ప్రాంతం నుంచి గంజాయి తరలిస్తున్నట్లు సమాచారం రావడంతో ఆదివారం గండేపల్లి ఎస్‌ఐ యూవీ శివనాగబాబు, సిబ్బంది గండేపల్లి మండలం నీలాద్రిరావుపేట వద్ద తనిఖీలు నిర్వహించారు. ఈతనిఖీల్లో బైక్‌పై వెళుతున్న ముగ్గురు వ్యక్తులను ఆపి పరిశీలించగా వారి వద్ద గంజాయి ఉన్నట్లు గుర్తించారు. 4.3 కిలోల గంజాయి, ఒక మోటారు సైకిల్, మూడు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. రాజవొమ్మంగికి చెందిన కెకె సాగర్, మాడుగులకు చెందిన కేపి కుమార్, సామర్లకోటకు చెందిన పీకే కృష్ణను అరెస్టు చేశారు. కిర్లంపూడికి చెందిన మరో నిందితుడు పరారీలో ఉన్నట్లు తెలిపారు. అరెస్టుచేసిన వారిని కోర్టులో ప్రవేశపెట్టగా 14రో జులు రిమాం డ్ విధించినట్లు జగ్గంపేట సీఐ వైఆర్‌కె శ్రీనివాస్ తెలిపారు. మొత్తం సొత్తు విలువ రూ.61,500 ఉంటుందన్నారు.

గోదావరిలో దూకి వ్యక్తి ఆత్మహత్య

ఐ.పోలవరం, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): అంబేడ్కర్ కోనసీమజిల్లా ఐ.పోలవరం మండలం మురమళ్ల బ్రిడ్జిపై నుంచి గోదావరిలోకి దూకి ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. శనివారం రాత్రి ఈదుర్ఘటన జరిగింది. దూకిన వ్యక్తి పశువుల్లంకకు చెందిన చింతలపూడి శ్రీనివాసరావు(66)గా పోలీసులు గుర్తించారు. అన్నంపల్లి అక్విడెక్టు సమీపంలో ఆదివారం సాయంత్రం మృతదేహం లభ్యమైంది. అమలాపురానికి చెందిన అల్లుడు బీమాల రవికుమార్ వేధింపులు భరించలేక తన భర్త ఆత్మహత్య చేసుకున్నట్టు మృతుని భార్య అమ్మాజీ పోలీసులకు ఫిర్యాదు చేసింది. కొన్నేళ్లగా తన కుమార్తెకు విడాకులు ఇవ్వకుండా అల్లుడు మానసిక ఇబ్బందులకు గురిచేస్తున్నాడని ఫిర్యాదులో పేర్కొంది. పోస్టుమార్టం కోసం మృతదేహాన్ని ముమ్మిడివరం ఆసుపత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ ఆర్.మల్లికార్జునరెడ్డి తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో భార్యాభర్తలు మృతి

● బైక్‌ను ఢీకొట్టిన జామాయిల్ లోడ్ ట్రాక్టర్
● ఎటపాక నవోదయా సమీపంలో ఘటన



రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన భార్యాభర్తలు రాంబాబు, ముత్యాలమ్మ(ఫైల్)

ఎటపాక, ఫిబ్రవరి 16 ఆంధ్రజ్యోతి: బైక్‌ను ఎదురుగా వస్తున్న జామాయిల్ కర్రల లోడ్ ట్రాక్టర్ ఢీకొని భార్యాభర్తలు మృతి చెందిన ఘటన ఆదివారంరాత్రి అల్లూరిజిల్లా ఎటపాక మండలంలో జవహర్ నవోదయ విద్యాలయం సమీపంలో చోటు చేసుకుంది. ఈఘటనకు సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. తెలంగాణలోని భద్రాద్రి కొత్తగూడెంజిల్లా దుమ్ముగూడెం మండలం మారాయిగూడెం పంచాయతీ లోని భీమవరం గ్రామానికి చెందిన సోయం రాంబాబు(52) సోయం ముత్యాలమ్మ(45) భార్యాభర్తలు. ఇరువురు భద్రాచలం వెళ్లి తిరిగి బైక్‌పై స్వగ్రామానికి ఎటపాక మీదుగా తెలంగాణలోని భీమవరంనకు వెళుతున్నారు. ఈక్రమంలో లక్ష్మీపురం వైపు నుంచి జామాయిల్ లోడ్‌తో ఎటపాక వైపు వస్తున్న ట్రాక్టర్ నవోదయ విద్యాలయం సమీపానికి రాగానే ఎదురుగా వస్తున్న బైక్‌ను ఢీకొంది. ఈప్రమాదంలో భార్యాభర్తలు ఇరువురు తీవ్రగాయాలతో అపస్మారకస్థితిలోకి వెళ్లారు. వెంటనే క్షతగ్రాతులను భద్రాచలం ఏరియా ఆసుపత్రికి తరలించారు. అప్పటికే వైద్యులు పరీక్షించి ఇద్దరు మృతి చెందినట్లు ధ్రువీకరించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కత్తిపూడి ప్రమాదంలో వ్యక్తి మృతి

● మరో ఇద్దరికి గాయాలు



మృతిచెందిన సత్యనారాయణ

శంఖవరం, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): కత్తిపూడి 16వ నెంబరు జాతీయరహదారిపై ఆదివారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో గొల్లప్రోలు మండలం చెందుర్తి గ్రామానికి చెందిన నక్కా సత్యనారాయణ (50) మృతిచెందగా, మరో ఇద్దరికి గాయాలయ్యాయి. అన్నవరం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం చెందుర్తి గ్రామానికి చెందిన మృతుడు కత్తిపూడి వచ్చి తన ద్విచక్ర వాహనంపై తిరిగి వెళుతుండగా మరో ద్విచక్రవాహనం వెనుకనుంచి ఢీకొట్టడంతో సత్యనారాయణ తలకు బలమైన గాయంకావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మరో ఇద్దరికి గాయాలయ్యాయి. క్షతగ్రాతులను ప్రత్తిపాడు ఏరియా ఆసుపత్రికి తరలించగా, మృతదేహాన్ని తుని ఏరియా ఆసుపత్రికి తరలించారు. అన్నవరం ఎస్‌ఐ శ్రీహరిబాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆగి ఉన్న వాహనాన్ని ఢీ కొని యువకుడి మృతి

● మరొకరికి గాయాలు



మృతి చెందిన దోకాడ రవికుమార్

తునిరూరల్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): ఆగి ఉన్న వాహనాన్ని ఢీ కొని ఒక యువకుడు మృతి చెందగా, మరొకరికి తీవ్ర గాయాలైన ఘటన తుని పట్టణ జాతీయ రహదారిపై చోటుచేసుకుంది. పట్టణంలోని డీ మార్ట్ సమీపంలో ఆదివారం ఉదయం జరిగిన ఈ సంఘటనలో విజయనగరంజిల్లా విలుపర్తి గ్రామానికి చెందిన దోకాడ రవికుమార్(25) రాంబిల్లి మండలం దిమిలి గ్రామానికి చెందిన నకిరెడ్డి కిల్లాడి ఇద్దరు యువకులు అన్నవరం ఓ వివాహ కార్యక్రమానికి హాజరై తిరిగి వెళుతుండగా ప్రమాదం జరిగింది. తుని పట్టణంలోని డీ మార్ట్ సమీపంలో ఆగి ఉన్న వ్యాన్‌ను బలంగా ఢీ కొట్టడంతో రవికుమార్(25)అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి స్నేహితుడు కొల్లాడి తీవ్ర గాయాలపాలయ్యాడు. సంఘటనా స్థలాన్ని పరిశీలించిన తుని పట్టణ పోలీసులు గాయాలపాలైన వ్యక్తిని ఏరియా ఆసుపత్రికి తరలించి వైద్య సేవలు అందించారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తుని పట్టణ సీఐ గీతా రామకృష్ణ తెలిపారు.

వైభవంగా భావనారాయణస్వామి తిరునాళ్లు

● పోటెత్తిన వేలాది మంది భక్తులు
● ఒక్కరోజే రూ. 5లక్షల ఆదాయం



పాలపొంగలి తయారు చేస్తున్న భక్తులు

సర్పవరం జంక్షన్, ఫిబ్రవరి 16 (ఆంధ్ర జ్యోతి):శ్రీరాజ్యలక్ష్మి సమేత శ్రీభావనారాయణస్వామి ఆలయంలో స్వామివారి జన్మదినం, తిరునాళ్ల వైభవంగా నిర్వహించారు. మాఘమాసం మూడో ఆదివారం తిరునాళ్ల, స్వామి జన్మదినోత్సవ పర్వదినాలు ఒకేరోజు కలసి రావడంతో స్వామివారిని దర్శించుకునేందుకు ఉమ్మడిజిల్లా నుంచే కాకుండా రెండు తెలుగు రాష్ట్రాలతో పాటూ కర్నాటక, మహారాష్ట్ర నుంచి సుమారు 50 వేల మంది భక్తులు తరలివచ్చి స్వామివారిని భక్తిశ్రద్ధలతో దర్శించుకున్నారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని తెల్లవారుజాము 4 గంటల నుంచే స్వామివారికి సుప్రభాతసేవ నిర్వహించి మేల్కొలిపిన అనంతరం భక్తులకు దర్శనం అనుమతించారు. ముందుగా భక్తులు భావనారాయణస్వామిని దర్శించుకున్న అనంతరం ఆలయం ఈశాన్యదిక్కులోఉన్న లక్ష్మీదేవి, ఆగ్నేయంలో ఉన్న ఆదిశేషు శ్రీభావనారాయణస్వామిని అత్యంత భక్తిశ్రద్ధలతో దర్శించుకున్నారు. స్వామివారికి ప్రీతిపాత్రమైన పాలపొంగులను ఆవుపిడకల పొయ్యిపై ఆవుపాలతో పరమాణ్ణం వండి నైవేద్యం సమర్పించారు. మాఘమాసంలో స్వామివారిని దర్శించుకుంటే దేశంలో ఉన్న 108 వైష్ణవ దేవాలయాల్లోఉన్న శైవక్షేత్రాలను దర్శించుకున్న ఫలితం సిద్ధిస్తుందని భక్తుల నమ్మకం. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ ఈవో ఎం.లక్ష్మీనారాయణ, ఉత్సవ కమిటీ చైర్మన్ పుల్ల శ్రీరాములు ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు, సౌకర్యాలు, వసతి కల్పించారు. కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ, అరుణ దంపతులు, కుమారుడు సందీప్‌ల ఆధ్వర్యంలో 25 వేల మంది భక్తులకు అన్నదానం చేశారు. స్వామివారిని దర్శించుకున్న భక్తులు వివిధ కానుకల రూపంలో హుండీలు, దర్శనం, సేవలు, ప్రసాదం, అన్నదానం ద్వారా రూ.5,00,300 లక్షలు ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈవో లక్ష్మీనారాయణ తెలిపారు.

కాకినాడ

• కాకినాడ సిటీ • రూరల్ • పిఠాపురం • పెద్దాపురం

కొత్తపల్లి మండలంలో 1,839 మంది ఓటర్లు

కొత్తపల్లి, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): మండలంలో 1,839 పట్టభద్రులు ఓట్లు నమోదైనట్టు మండల సహాయ గణాంకుడు బండి అప్పలరాజు తెలిపారు. ఎమ్మెల్సీ ఎన్నికకు మండలంలో 3 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. తహశీల్దార్ కార్యాలయం 1, ఉప్పాడ కొత్తపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2 పోలింగ్ కేంద్రాల్లో ఓటు వేయవచ్చన్నారు.

గ్యాస్ వాటా కోసం ఉద్యమించాలి

23న మన గ్యాస్, మన చమురు వనరులపై ఏపీ ప్రజల హక్కు సదస్సు

సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు


కాకినాడలో సదస్సు కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న ముప్పాళ్ల నాగేశ్వరరావు, నాయకులు

కాకినాడ సిటీ, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): మన గ్యాస్, మన చమురు వనరులపై ఏపీ ప్రజల హక్కుగా కాపాడుకోవాలని కోరుతూ ఈ నెల 23న కాకినాడలో జరిగే సదస్సును విజయవంతం చేయాలని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక ఎస్టీయూ భవన్‌లో సీపీఐ ఆధ్వర్యాన విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ముప్పాళ్ల మాట్లాడుతూ అప్పుల్లో కూరుకుపోయిన మన రాష్ట్రం అభివృద్ధి సాధించడానికి గ్యాస్ వాటా కోసం అందరూ ఉద్యమించాలన్నారు. కాకినాడ సముద్ర తీరంలో ఏర్పడిన చమురు గ్యాస్ నిక్షేపాలు, మన గ్యాస్ మనకే దక్కాలని గ్యాస్ వాటా కోసం అన్ని రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు ఏకమై పోరాటం చేయాలన్నారు. ఆంధ్ర ప్రాంతానికి న్యాయమైన గ్యాస్ కేటాయింపుల కోసం, 50 శాతం లాభం వాటా కోసం వామపక్షాలు, ప్రజాస్వామికవాదులు కృషి చేయాలన్నారు. ఈ విషయమై ఏపీ శాసనసభ, శాసనమండలి ఏకగ్రీవ తీర్మానాలు చేసినా గ్యాస్ కేటాయింపులు, ఆదాయంలో సగం వాటా పొందలేకపోతున్నామన్నారు. మన దేశంలో ముంబాయ్ కన్నా మన గోదావరి బేసిన్‌లో ఎక్కువ గ్యాస్ నిల్వలు ఉన్నాయన్నారు. దీనిపై 23న తలపెట్టిన సదస్సులో ఉపాధ్యాయులు, విద్యార్థులు, కార్మికులు, రైతులు, అన్ని వర్గాల ప్రజలు పాల్గొనాలని కోరారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు డేగ ప్రభాకర్ మాట్లాడుతూ మన తీర ప్రాంతంలో ఉన్న సహజ వనరులను పాలకులు బడా కార్పొరేట్ కంపెనీలకు దాసోహం చేస్తున్నారని విమర్శించారు. అనంతరం ప్రజా సంఘాల నాయకులు, విద్యావేత్తలతో సమావేశం నిర్వహించారు. సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు తాటిపాక మధు, కాకినాడ జిల్లా కార్యదర్శి కె.బోడకొండ, బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కార్యదర్శి కె.సత్తిబాబు, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి తోకల ప్రసాద్, విద్యావేత్తలు ఆలపాటి శ్రీనివాస్, కె.ఆదినారాయణమూర్తి, చింతపల్లి సుబ్బారావు, పి.సుబ్బరాజు తదితరులున్నారు.

ఇంటి పెద్దకొడుకుగా ఆదుకుంటున్న చంద్రబాబు

మాజీ ఎమ్మెల్యే వర్మ


పిఠాపురంలో ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కును అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే వర్మ

పిఠాపురం, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): ప్రజలకు ఏ కష్టం వచ్చినా ముఖ్యమంత్రి చంద్రబాబు ఇంటి పెద్దకొడుకుగా అండగా ఉంటూ ఆదుకుంటున్నారని పిఠాపురం మాజీ ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్వీఎస్ఎన్ వర్మ తెలిపారు. పిఠాపురం మండలం పి.దొంతమూరు గ్రామానికి చెందిన బండి జ్యోతి కుటుంబసభ్యులకు ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా మంజూరైన రూ. 2.56లక్షల చెక్కును పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో ఆదివారం వర్మ అందజేశారు. ప్రజల ఆరోగ్య అవసరాల కోసం ఎంత మొత్తమైనా వెచ్చించేందుకు కూటమి ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

'ఎక్స్‌ప్రెస్ రైళ్లకు పిఠాపురంలో హాల్ట్ కల్పించాలి'

పిఠాపురం, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): జన్మభూమి, రత్నాచల్ సహా దూర ప్రాంతాలకు వెళ్లే ఎక్స్‌ప్రెస్ రైళ్లకు పిఠాపురంలో హాల్ట్ కల్పించాలని పలువురు డిమాండ్ చేశారు. పిఠాపురంలో ఆదివారం రాజ్యసభ సభ్యుడు సానా సతీష్‌బాబు చిత్రపటానికి ఏటూ జెడ్ వాలంటీర్ సారా శేఖర్ ఆధ్వర్యంలో పాలాభిషేకం నిర్వహించారు. సేవా కార్యక్రమాలు నిర్వహణ ద్వారా గుర్తింపు తెచ్చుకుని ఎంపీ అయిన సతీష్‌బాబు మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించాలని ఆకాంక్షించారు. అదే సమయంలో రైళ్ల హాల్టుతో పాటు రైల్వేశాఖ ద్వారా పిఠాపురంలో మరిన్ని సౌకర్యాలు కల్పించేలా సానా చూడాలని కోరారు. పిఠాపురం-కాకినాడ మెయిన్‌లైన్‌కు నిధులు కేటాయించేలా కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. పిఠాపురం అర్బన్ సొసైటీ వైస్ చైర్మన్ మేళం రామకృష్ణ, డైరెక్టర్ అరిగెల ప్రసాదరావు, విశ్రాంత ఎస్ఐ వీసం కృష్ణ తదితరులున్నారు.

'క్రీడల పట్ల మక్కువ పెంచుకోవాలి'

కాకినాడ సిటీ, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువుతో పాటు క్రీడల పట్ల మక్కువ పెంచుకోవాలని భాష్యం స్కూల్ జోనల్ ఇన్‌చార్జ్ గోవిందరాజులు పేర్కొన్నారు. స్థానిక శాంతినగర్ భాష్యం స్కూల్‌లో ఆదివారం కాకినాడ జిల్లా సెకండ్ ఓపెన్ టైక్వాండో ఛాంపియన్‌షిప్-2025 పోటీలు జరిగాయి. తూర్పుగోదావరి జిల్లా టైక్వాండో అసోసియేషన్ ఆధ్వర్యంలో సబ్ జూనియర్స్, కేడెట్ జూనియర్స్ కేటగిరిలలో నిర్వహించిన ఈ పోటీలలో 21టీమ్‌లు పాల్గొన్నాయి. ముఖ్య అతిథిగా రాష్ట్ర వైద్య ఆరోగ్య మౌలిక సదుపాయాల సంస్థ మాజీ చైర్మన్ యనమదల రవి, ప్రత్యేక అతిథిగా వ్యాపారవేత్త పెంకే రాజు హాజరై పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా టైక్వాండో అసోసియేషన్ అధ్యక్షుడు రాయుడు శ్రీనివాసరావు, స్కూల్ ఆర్గనైజింగ్ కార్యదర్శి, టైక్వాండో క్రీడల నేషనల్ రిఫరీ వి.శ్రీనివాస్ కుమార్, టెక్నికల్ ఆఫీషియల్స్ పి.లక్ష్మణరావు, తరుణ్, రాజేష్, స్కూల్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న నృత్య ప్రదర్శనలు

సర్పవరం జంక్షన్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): వారాంతపు సాంస్కృతిక కార్యక్రమంలో భాగంగా కాకినాడకు చెందిన శ్రీజగన్నాథ నాట్యాలయం పల్లా వీర వెంకట సత్యవతి బృందం ఆధ్వర్యంలో నిర్వహించిన పలు సాంస్కృతిక నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కేంద్ర,రాష్ట్ర చేనేత జౌళిశాఖల ఆధ్వ ర్యంలో కాకినాడ రూరల్ మండలం సూర్యారావుపేట బీచ్ శిల్పారామంలో పరిపాలనాధికారి సి మోహన్ తేజ ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి ఈ ప్రదర్శనలు నిర్వహించారు. అధిక సంఖ్యలో సందర్శకులు వీటిని తిలకించారు.


శిల్పారామంలో ఆకట్టుకున్న నృత్య ప్రదర్శన

మహాసౌరయాగ పూజలు


సామర్లకోటలో పూజల దృశ్యం

సామర్లకోట, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): సామర్లకోట గోదావరి ఒడ్డున ఉన్న మాండవ్య నారాయణ స్వామి ఆలయంలో ఆదివారం ఏకాంబికా మహాసౌరయాగం పూజలు ఘనంగా నిర్వహించారు. ఆధ్యాత్మికవేత్త నోరి కృష్ణారావు దంపతుల ఆధ్వర్యంలో సుమారు 12 మంది వేదంలో నిష్ణాతుల నేతృత్వంలో వేదమంత్రోచ్ఛారణల మధ్య సూర్యనమస్కారములు, హోమపూజలు, పూర్ణాహుతి, శాంతి కరకల్యాణ పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో దంపతులు ఆశీనులయ్యారు. అనంతరం మహాన్నదానం జరిగింది. పూజల్లో భీమేశ్వరా అన్నదాన ట్రస్ట్ ప్రతినిధి బిక్కిన పరమేశ్వర సాయి సత్యనారాయణ దంపతులు, ఆలయ అర్చకులు చక్రవర్తుల రఘు పాల్గొన్నారు. అంతకుముందు మాండవ్యనారాయణస్వామికి, మహాలక్ష్మి అమ్మవార్లకు విశేష పుష్పార్చన పూజలు ఘనంగా నిర్వహించారు.

అంగన్వాడీ కార్యకర్త విజయం

తాళ్లరేవు, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): పోలేకుర్రు పంచాయతీ తోటపేటకు చెందిన అంగన్‌వాడీ కార్యకర్త సాదనాల మంగాదేవి ఓ కేసు విషయంలో తమ ప్రత్యర్థులపై విజయం సాధించడం పట్ల ఆర్‌పీఐ జిల్లా అధ్యక్షుడు పిట్లా వరప్రసాదరావు, హైకోర్టు న్యాయవాది అయి నాపురపు సూర్యనారాయణ, తాళ్లరేవు మండల కెవిపీఎస్ అధ్యక్షుడు విప్పర్తి శ్రీనివాస్ అభినందించారు. ఆదివారం వారు మాట్లాడుతూ మంగాదేవి పోలేకుర్రు అంగన్వాడీ కేంద్రంలో పనిచేసేందుకు ఇతర కులస్తులు అడ్డుకోవడంతో ఆమె 2018లో కోరింగ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఏడేళ్ల తర్వాత రాజమండ్రి ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కోర్టు వాదోపవాదనలు జరిపిన తరువాత తీర్పును 2025 ఫిబ్రవరి 11న వెలువరించింది. ఈ కేసులో నిందితుల్లో ఒకరు మరణించడంతో ముగ్గురికి 6 నెలలు జైలు శిక్ష, జరినామా విధించినట్టు న్యాయవాది తెలిపారు.

ఎక్కడికక్కడ మురుగునీరు!

ప్రధాన డ్రెయిన్లలో తొలగించని పూడికతో ప్రజలకు ఇబ్బందులు

పిఠాపురం, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): ప్రధాన డ్రెయిన్లలో పూడిక సక్రమంగా తొలగించకపోవడంతో మురుగునీరు ఎక్కడికక్కడ నిలిచిపోతోంది. పిఠాపురం పట్టణంలోని చర్చి సెంటర్ తదితర ప్రాంతాల్లోని డ్రెయిన్లు పూడికలతో నిండిపోయాయి. మెయిన్‌రోడ్డుపై ఉన్న ఈ డ్రెయిన్లలో పూడికను సక్రమంగా తీయకపోవడంతో మురుగునీరు ఎక్కడిక్కడ నిలిచిపోయి పొంగి పొర్లడానికి సిద్ధంగా ఉంది. దీని వల్ల దోమల బెడద అధికమవుతోందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మున్సిపల్ అధికారులు స్పందించి డ్రెయిన్లల్లో పూడిక తొలగించాలని వారు కోరుతున్నారు.




పిఠాపురం మెయిన్‌రోడ్డు చర్చిసెంటర్ సమీపంలో డ్రెయిన్లలో పూడిక సక్రమంగా తొలగించకపోవడంతో నిలిచిపోయిన మురుగునీరు

వేగంగా నాలుగు లేన్ల రోడ్డు విస్తరణ పనులు

ఎన్‌హెచ్ ప్రాజెక్టు డైరెక్టర్ సురేంద్రనాథ్


బీచ్‌రోడ్డులో రైల్వే ట్రాక్ వద్ద నిర్మాణ పనులపై అధికారులతో చర్చిస్తున్న సురేంద్రనాథ్

సర్పవరం జంక్షన్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): కాకినాడ యాంకరేజి పోర్టు నుంచి ఏడీబీ రోడ్డు పెద్దాపురం రాక్ సిరామిక్ వరకు నాలుగు లేన్ల రోడ్డు విస్తరణ నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నాయని జాతీయ రహదారులు శాఖ ప్రాజెక్టు డైరెక్టర్ సురేంద్రనాథ్ తెలిపారు. ఆర్ కే కన్‌స్ట్రక్షన్స్ ఆధ్వర్యంలో అచ్చంపేట సెంటర్ గోకుల్ గార్డెన్ నుంచి యాంకరేజి వరకు జరుగుతోన్న నాలుగు వరుసల రోడ్డు విస్తరణ పనులను పర్యవేక్షించారు. ఆయన మాట్లాడుతూ సూర్యారావుపేట లైట్‌హౌస్, బీచ్‌రోడ్డులో పోర్టు వద్ద ఉన్న రైల్వే ట్రాక్ వద్ద రోడ్డు విస్తరణ పనుల్లో ఏర్పడిన సాంకేతిక సమస్యల పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై అధికారులు, ఆర్‌కే కంపెనీ ప్రతినిధులతో చర్చించి, పలు సూచనలు చేశారు. ఆజాదీ కా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా గతిశక్తి పథకం కింద కేంద్రం రూ.557 కోట్ల నిధులతో యాంకరేజి పోర్టు నుంచి పెద్దాపురం రాక్ సిరామిక్ వరకు నాలుగు లేన్ల రహదారి నిర్మాణం చేపట్టిందన్నారు. 26 కిలోమీటర్ల మేర రోడ్డు ఆధునీకరణ, ఆర్వోబీలు, రోడ్డు కమ్ బ్రిడ్జిలు, పీయూసీలు నిర్మాణం జరుగుతుందన్నారు. ఫ్లై ఓవర్ల బ్రిడ్జిల నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నాయన్నారు. కాకినాడ రూరల్ మండలం ఏడీబీ రోడ్డు గోకుల్ గార్డెన్ నుంచి రోడ్డు నిర్మాణ పనులను ఆర్‌వీఎన్ఎల్ సంస్థ, గోకుల్ గార్డెన్ నుంచి లైట్ హౌస్ మీదుగా కాకినాడ యాంకరేజిపోర్టు వరకు ఆర్‌కే కన్‌స్ట్రక్షన్ కంపెనీ ఆధ్వర్యంలో రోడ్డు విస్తరణ నిర్మాణ పనులు జరుగుతున్నాయని తెలిపారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు సత్యరమేష్, ఎన్‌హెచ్ అధికారులు పాల్గొన్నారు.

'ఎమ్మెల్సీ ఎన్నికల్లో పేరాబత్తుల రాజశేఖర్‌ను గెలిపించాలి'


కాకినాడ సమావేశంలో ఎమ్మెల్యేలు కొండబాబు, నానాజీ, టీడీపీ జిల్లా అధ్యక్షుడు నవీన్


సామర్లకోటలో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న చినరాజప్ప

సామర్లకోట/పెద్దాపురం, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): ఉభయగోదావరి జిల్లాల గ్రాడ్యుయేట్ల ఎమ్మెల్సీ కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్‌కు తొలి ప్రాధాన్యత ఓటును వేసి అఖండ మెజార్టీతో గెలిపించాలని పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప కోరారు. సామర్లకోటలో 17,18 వార్డుల్లో ఆదివారం రాజప్ప కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలతో కలిసి ఇంటింటా ప్రచారాన్ని నిర్వహించారు. రాజశేఖర్‌ను గెలిపించాలని కోరుతూ టీడీపీ ముద్రించిన కరపత్రాలను ఓటర్లకు అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. అలాగే పెద్దాపురం మండలం జి.రాగంపేట గ్రామంలో గ్రాడ్యుయేట్ ఓటర్లను ఎమ్మెల్యే రాజప్ప ఇంటింటా కలిసి రాజశేఖర్‌ను గెలిపించాలని కోరారు. అంతకుముందు ఉదయం మండలంలోని మర్లావ, దివిలి, తిరుపతి, చంద్రమాంపల్లి గ్రామాల్లో కూటమి నాయకులతో ప్రచారం నిర్వహించారు. ప్రచారంలో కొత్తెం వెంకట శ్రీనివాసరావు(కోటి), ఎలిశెట్టి నాని పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యేల ప్రచారం

పిఠాపురం రూరల్, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ కూటమి ఎమ్మెల్సీ అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్‌కు మద్దతుగా పిఠాపురం మండలం నవఖండ్రవాడ గ్రామంలో అనకాపల్లి, పిఠాపురం మాజీ ఎమ్మెల్యేలు పీలా గోవింద సత్యనారాయణ, ఎస్వీఎస్ఎన్ వర్మ ఆదివారం సాయంత్రం ప్రచారం నిర్వహించారు. పట్టభద్రుల ఓటర్లను కలిసి రాజశేఖర్‌కు ప్రథమ ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు సకుమళ్ల గంగాధర్, నాయకులు పాల్గొన్నారు.

రాజశేఖర్‌కు మద్దతుగా బీసీల ఆత్మీయ సమావేశం

కాకినాడ సిటీ, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ కూటమి అభ్యర్థి రాజశేఖర్‌కు మద్దతుగా స్థానిక కాస్మోపాలిటన్ క్లబ్‌లో ఆదివారం జిల్లా బీసీల ఆత్మీయ సమావేశం నిర్వహించారు ఈ సమావేశానికి ఆల్ ఇండియా వీవర్స్ ఫెడరేషన్ జాతీయ కార్యవర్గ సభ్యుడు పప్పు దుర్గా రమేష్ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథులుగా కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు, కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ, టీడీపీ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్, ఎమ్మెల్సీ కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్ పాల్గొన్నారు. అతిథులు మాట్లాడుతూ ఎమ్మెల్సీ కూటమి అభ్యర్థి రాజశేఖర్‌ను భారీ మెజారిటీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. కాకినాడ సూపర్ బజార్ చైర్మన్ త్రెసింగి ఆదినారాయణ, ఎంఏ తాజుద్దీన్, సుందరనీడి గోపాలకృష్ణ, బీసీ సంఘాల నాయకులు,మద్దతుదారులు పాల్గొన్నారు.

'ప్రచారం జోరు పెంచాలి'

ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ కూటమి అభ్యర్థి రాజశేఖర్‌కు మద్దతుగా ఇంటింటా ఎన్నికల ప్రచారం జోరు పెంచాలని కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు పేర్కొన్నారు. ఆదివారం తన నివాసం వద్ద పేరాబత్తుల బ్యాలెట్ పేపర్‌ను ఎమ్మెల్యే ఆవిష్కరించారు. అనంతరం సిటీ నియోజకవర్గ ఇన్‌చార్జిలతో కొండబాబు సమావేశం నిర్వహించారు. ఎన్నికల్లో రాజశేఖర్‌కు బ్యాలెట్ పేపర్‌లో ఒకటో నంబర్ వద్ద మొదటి ప్రాధాన్యత ఓటు వేసి భారీ మెజారిటీతో గెలుపొందేందుకు కృషి చేయాలన్నారు. టీడీపీ నగర అధ్యక్షుడు మల్లిపూడి వీరు, నాయకులు గదుల సాయిబాబు, తుమ్మల రమేష్, వొమ్మి బాలాజీ, బచ్చు శేఖర్, ఎంఏ తాజుద్దీన్, పలివెల రవి అనంతకుమార్, ఎస్‌కే రహీమ్, చింతలపూడి రవి, పంతాడి రాజు, చింతా పేరరాజు, కోనాడ ప్రకాష్ ఉన్నారు.

నిబంధనలకు విరుద్ధంగా ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం నిర్వహించలేదు

యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు

కాకినాడ సిటీ, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేస్తున్న కొందరు అభ్యర్థుల మద్దతుదారులు కాజులూరు మండలం కుయ్యేరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం జరిగిన ఉపాధ్యాయుల క్లస్టర్ సమావేశంలో కరపత్రాలు పంపిణీ చేశారని, దానిలో భాగంగా నున్నబోయిన గణేష్ అనే ఉపాధ్యాయుడికి కూడా కరపత్రం ఇచ్చారని, అంతే తప్ప గణేష్ నిబంధలకు విరుద్ధంగా ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం నిర్వహించలేదని యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష ప్రధాన, కార్యదర్శులు సీహెచ్. సూరిబాబు, కేవీవీ నగేష్ తెలిపారు. ఆదివారం విడుదల చేసిన ప్రకటనలో గణేష్ నిబంధనలకు విరుద్ధంగా క్లస్టర్ సమావేశంలో ఎన్నికల ప్రచారం చేశారని పత్రికలలో వచ్చిన వార్తలు వాస్తవం కాదని ఖండించారు. తాను ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం నిర్వహించలేదని సదరు ఉపాధ్యాయుడు గణేష్ ప్రకటనలో పేర్కొన్నారు.

పొగమంచు వీడక... రోడ్డు కనిపించక..!


గొల్లప్రోలు బైపాస్ వై జంక్షన్ సమీపంలో హైవేపై పొగమంచు

గొల్లప్రోలు, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): పొగమంచు వీడక రోడ్డు కనిపించని పరిస్థితి ఉండడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. గొల్లప్రోలు ప్రధాన రహదారులతో పాటు బైపాస్ వైజంక్షన్ వద్ద 216వ జాతీయ రహదారిపై ఆదివారం దట్టంగా పొగమంచు అలముకుంది. ఉదయం 8 గంటలు అయినా తగ్గలేదు. వాహనాలకు ఏమి కనిపించని స్థితి ఉండటంతో వాహనాలను రోడ్డు పక్కన నిలిపివేశారు.

లారీపై టార్పాలిన్ కట్లు విప్పుతూ డ్రైవర్ మృతి

పెదవేగి, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): లారీపై కప్పి ఉంచిన టార్పాలిన్‌కు ఉన్న కట్లు విప్పుతూ డ్రైవర్ మృతి చెందినట్టు పెదవేగి ఎస్ఐ కె.రామకృష్ణ తెలిపారు. కాకినాడ ఇంద్రపాలెనికి చెందిన పిల్లి నూకరాజు హైదరాబాద్ నుంచి పెదవేగి మండలం వంగూరు లోని గౌతమీ ఆగ్రో ఇండస్ట్రీకి ఖాళీ బ్రాందీ సీసాల లోడు లారీతో ఆదివారం మధ్యాహ్నం 3 గంటల సమయంలో వచ్చాడు. ఖాళీ సీసాలను దించడానికి లారీపై కప్పి ఉంచిన టార్పాలిన్‌ను తొలగించడానికి తాడును తొలగిస్తూ లారీపై కుప్పకూలిపోయాడు. అక్కడి సిబ్బంది 108కు సమాచారం అందించారు. 108 సిబ్బంది వచ్చి పరిశీలించగా అప్పటికే నూకరాజు (55) మృతి చెందాడని చెప్పారు. నూకరాజు మృతిపై బంధువులకు సమాచారం అందించామని, వారు వచ్చిన తరువాత పంచనామా నిర్వహించి, శవ పరీక్షకు తరలిస్తామని ఎస్ఐ పేర్కొన్నారు.

ఎమ్మెల్సీ కోడ్ వర్తించదా?

సర్పవరం జంక్షన్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): కాకినాడ రూరల్ నియోజకవర్గం 2వ డివిజన్ కృష్ణనగర్ బ్యాంకు కాలనీ సచివాలయం-2 భవనంపై మాజీ సీఎం జగన్ ఫొటో తొలగించకపోవడం పట్ల అధికారుల ఉదాశీన వైఖరిపై పలు విమర్శల వెల్లువెత్తుతున్నాయి. ఎమ్మెల్సీ కోడ్ ఇక్కడ వర్తించదా అని పలువురు ప్రశ్నిస్తున్నారు.



నేటి నుంచి మంచినీటి సరఫరా నిలుపుదల

కార్పొరేషన్ (కాకినాడ), ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): మంచినీటి సరఫరా నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా వారు చేపట్టిన ఏడీబీ రోడ్డు అనగా అచ్చంపేట జంక్షన్ నుంచి సామర్లకోట నుంచి శశికాంత్ నగర్ ఫిల్టరేషన్ ప్లాంట్‌కు వచ్చే కాకినాడ నగరపాలక సంస్థ నీటి సరఫరా చేసే ప్రధాన పైపు 1500 ఎంఎం లైన్‌పై నాలుగు చోట్ల ఇంటర్ కనెక్షన్లు చేసే నిమిత్తం ఈనెల 17వ తేదీ సాయంత్రం నుంచి 20న సాయంత్రం వరకు మంచినీటి సరఫరా నిలుపుదల చేయడం జరుగుతుంది. శశికాంత్ నగర్, శ్రీవి ద్యకాలనీ(డీమార్టు), భాస్కర్‌నగర్, దుమ్ములపేట, సాంబమూర్తినగర్, ఏఎంజీ, శ్రీనివాసబ్యాంకు కాలనీ(గ్రైగోలపాడు) 1 నుంచి 13, 49, 50 వార్డులు ఏరియా పరిధిలో ఉన్న ప్రజలకు ప్రత్యామ్నాయంగా ట్యాంకర్ల ద్వారా మంచి నీటి సరఫరా చేయడం జరుగుతుంది. ట్యాంకర్లు అత్యవసరమైతే 9848471415, 6301387834, 9676770461, 738204 2977 నెంబర్లను సంప్రదించాలని అధికారులు తెలిపారు.

పేకాట శిబిరాలపై దాడులు

19 మంది అరెస్ట్

పెద్దాపురం/ సామర్లకోట, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి):పెద్దాపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో చినబ్రహ్మదేవం, జగన్నతిమ్మాపురం, పులిమేరు గ్రామాల్లో పెద్దాపురం ఎస్ఐ మౌనిక ఆధ్వర్యంలో ఆదివారం తన సిబ్బందితో కలిసి పేకాట శిబిరాలపై దాడులు నిర్వహించారు. 19 మందిని అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.87,750 నగదు స్వాధీనం చేసుకున్నారు. మరో 4 మోటార్‌సైకిళ్లను స్వాధీనం చేసుకున్నారు. చినబ్రహ్మదేవంలో పేకాడుతున్న ఏడుగురి నుంచి రూ.13,800... జగన్నతిమ్మాపురంలో పామాయిల్‌తోటలో పేకాడుతున్న 8మంది నుంచి రూ.68,700 నగదు, 4మోటార్‌సైకిళ్లను స్వాధీనం చేసుకున్నారు. చదలాడలో పేకాడుతున్న నలుగురిని అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ. 5,250 నగదు స్వాధీనం చేసుకున్నట్టు పేర్కొన్నారు.

వేట్లపాలెంలో 14 మంది అరెస్ట్

సామర్లకోట, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వేట్లపాలెంలో ఒక ఫంక్షన్ హాలు నందు పేకాట శిబిరంపై ఆదివారం తెల్లవారుజామున సామర్లకోట సీఐ ఏ.కృష్ణ భగవాన్ ఆధ్వర్యంలో పోలీసులు దాడులు నిర్వహించారు. పేకాడుతున్న 14 మందిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.1,21,050 స్వాధీనం చేసుకున్నారు. సోమవారం కోర్టు ఎదుట హాజరుపర్చనున్నారు.

గ్రావెల్ అక్రమ తవ్వకాలపై పోలీసుల దాడి

ట్రాక్టర్ సీజ్

గొల్లప్రోలు రూరల్, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): గ్రావెల్ అక్రమ తవ్వకాలపై పోలీసులు దాడులు నిర్వహించి ట్రాక్టర్‌ను సీజ్ చేశారు. గొల్లప్రోలు మండలం చెందుర్తి శివారు పోలవరం-పుష్కర కాలువ గట్టుపై ఉన్న గ్రావెల్‌ను జేసీబీలతో తవ్వి అక్రమంగా తరలిస్తున్నారన్న సమాచారంతో ఆదివారం తెల్లవారుజామున ఎస్ఐ ఎన్.రామకృష్ణ ఆధ్వర్యంలో పోలీసులు దాడులు నిర్వహించారు. గట్టు వెంబడి గ్రావెల్ తరలిస్తున్న ట్రాక్టర్‌ను ఆపి స్వాధీనం చేసుకున్నారు. తవ్వకాలు జరిగే ప్రాంతం వద్దకు వెళ్లగా జేసీబీతో వ్యక్తి పరారయ్యాడు. సంఘటనకు సంబంధించి ట్రాక్టర్ డ్రైవర్ కోరుమిల్లి సురేష్, జేసీబీ డ్రైవర్ వాసారాజుపై కేసు నమోదు చేశారు. ట్రాక్టర్‌ను పోలీసుస్టేషన్‌కు తరలించారు. గొల్లప్రోలు ఎస్ఐ రామకృష్ణ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అమ్మవారి ఆలయానికి భక్తులు

దేవీపట్నం, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): దేవీపట్నం మండల పరిధిలో ఉన్న మాత్మణి గండిపోశమ్మ అమ్మవారి ఆలయానికి ఆదివారం మైదాన ప్రాంతాల నుంచి భారీగా భక్తు లు హాజరయ్యారు. అమ్మవారికి అభిషే కాలు, కుంకుమార్చనలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు.

జగ్గంపేట

• జగ్గంపేట • తుని • ప్రత్తిపాడు

రంపచోడవరం

• రంపచోడవరం, మారేడుమిల్లి • దేవీపట్నం • రాజవొమ్మంగి • అడ్డతీగల • గంగవరం • వై రామవరం • చింతూరు • కూనవరం • వీఆర్ పురం • ఎటపాక



వాహనాలు తనిఖీ చేస్తున్న దృశ్యం

ముమ్మరంగా వాహనాల తనిఖీ

మోతుగూడెం, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): చింతూరు సీఐ తెల్లం దుర్గాప్రసాద్ ఆదేశాల ప్రకారం మోతుగూడెంలో ఆదివా రం విస్తృతంగా వాహనాలు తనిఖీలు చేశారు. ఈనెల 27న ఎమ్మెల్సీ ఎన్నికలు ఉన్నందున పోలీసులు వాహనాలు తనిఖీలు చేపట్టారు. బస్సుల్లో ప్రయాణికుల బ్యాగులు, సోదాలు చేశారు. ఇత ర ప్రైవేట్ వాహనాలు, ద్విచక్రవాహనాలు క్షుణ్ణంగా పరిశీలించారు. మోతుగూడెం పో లీసుస్టేషన్ చెక్‌పోస్ట్ వద్ద ఎస్ఐ శివనారాయణ, సిబ్బంది వాహనాలు తనిఖీ చేశారు. అనుమ తులు లేకుండా నడిపే వాహనాలతో పాటు లైసెన్సులు వాహనాలను ఐకరిపత్రాలను పరిశీ లించారు. ఎస్ఐ మాట్లాడుతూ వాహనదారులు తప్పనిసరిగా లైసెన్స్ ఉండాలన్నారు. కని, ఆదివారాలలో పర్యాటకుల సంఖ్య ఎక్కువకావడంతో మద్యం సేవించి వాహనాలు నడిపితే కఠినచర్యలు తప్పవని సూచించారు. పొల్లూరు జలపాతం వద్దకు వారాంతపు సెల వుల వల్ల పర్యాటకుల తాకిడి ఎక్కువైంద న్నారు. గంజాయి రవాణా అరికట్టేందుకు మోతుగూడెం చెక్‌పోస్ట్ వద్ద వాహనాలు ముమ్మరంగా తనిఖీలు చేశామన్నారు. ఈ తని ఖీల్లో సీఆర్పీఎఫ్ ఏ42 బెటాలియన్, సివిల్ పోలీసులు పాల్గొన్నారు.

రాజవొమ్మంగి : మండలంలోని జడ్డంగి పోలీస్‌స్టేషన్ ఎదు రుగా ఆదివారం ఎస్ఐ విజ యకుమార్ ఆధ్వర్యంలో ఆదివారం పోలీసులు విస్తృతంగా వాహన తనిఖీలను నిర్వహించారు. ప్రతీ వాహనాన్ని ఆపి ఎక్కడి నుంచి వెళు న్నారో నమోదుచేసుకున్నారు. రికార్డులు లేకుండా వాహనాలను నడపవద్దని, మైనర్లకు వాహనాలు ఇవ్వద్దని విజయ్‌కుమార్ అవగా హనను కల్పించారు. జాతీయ రహదారి నిబం ధనల ప్రకారం వాహన రాకపోకలు సాగించా లన్నారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్ఐ వి జయకుమార్, కానిస్టేబుల్ ప్రసాద్‌రెడ్డి, ఏపీఎస్‌పీ సిబ్బంది ఉన్నారు.

జేఈఈ మెయిన్స్‌లో మెరిసిన గిరిజన తేజం

● సత్తాచాటిన కోట గ్రామానికి చెందిన జై కిసాన్

వైరామవరం, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): జే ఈఈ మెయిన్స్ 2025 పరీక్షా ఫలితాల్లో గి రిజన విద్యార్థి జాతీయస్థాయిలో సత్తా చాటా డు. అల్లూరి సీతారామరాజుజిల్లా వైరామవరం మం డలం కోట గ్రామానికి చెందిన కింటుకూ రి జైకిసాన్ 97.67 పర్సంటైల్‌తో జాతీయస్థాయి లో రెండోస్థానం సాధించాడు. జై కిసాన్ అడ్డతీ గల మండలం చినముసక గడ్డ గిరిజన ప్రాథ మిక పాఠశాలలో 3వ తరగతి, రంపచో డవరం బెనారా పబ్లిక్ స్కూల్‌లో 4నుంచి 10వ తరగతి వరకు చదివాడు. వేలువెన్ను శశి ఇన్‌స్టిట్యూట్‌లో ఇంటర్మీడియట్ చదువుతున్నా డు. ఉత్తమ మార్కులు సాధించిన జై కిసా న్‌ను అల్లూరి జిల్లా కలెక్టర్ దినేష్‌కుమార్ అభినందించారు. కుమారుడు సాధించిన వి జయానికి తల్లిదండ్రులు లక్ష్మణరావు, అమలకు మారి సంతోషాన్ని వ్యక్తం చేశారు.



జై కిసాన్‌ను అభినందిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్

ఐఏఎస్ నా కల..

అల్లూరి జిల్లా కలెక్టర్ నా స్ఫూర్తి. జైకిసాన్ ఐఏఎస్ చదివి గిరిజన గ్రామాలకు సేవ చేయడమే నాకల. గతంలో రంపచోడవరం ఐటీడీఏ పీవోగా పనిచేసిన ఇప్పటి అల్లూరి జిల్లా కలెక్టర్ దినేష్‌కుమార్ నా స్ఫూర్తి.

శ్రీమల్లికార్జున స్వామివారి విగ్రహాల పునఃప్రతిష్ఠ మహోత్సవం



పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

మోతుగూడెం, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): చింతూరు మం డలం మోతుగూడెం పరిధిలో ఉన్న పొల్లూరు గ్రామం నుంచి హిందుస్థాన్ రోడ్డు శ్రీ మల్లికార్జునస్వామి వారి పునఃప్రతిష్ఠ మహోత్సవం ఆదివారం ఉదయం నుంచి ప్రధాన అర్చకులు కుమారస్వామిశర్మ ఆధ్వర్యం లో మల్లికార్జునస్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ప్రధాన అర్చకుడు ఆలయ ధర్మకర్త మల్లికార్జున దంపతులతో యాగం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సీలేరు కాంప్లెక్స్ చీఫ్ ఇంజనీర్ జీవీ వాసుదేవరావు దంపతులు, యూనియన్ బ్యాం క్ మేనేజర్ విశ్వనాథ సత్యనారాయణ దంపతు లు మోతుగూడెం, పొల్లూరు ఏపీ జెన్‌కో ఉద్యో గస్తులు, గ్రామస్థులు, యువకులు పాల్గొన్నారు.

ఘనంగా అడవిరాజుల బాబు పండుగ



వై.రామవరంలో రాజులబాబు పండగలో సహపంక్తి భోజనాలు చేస్తున్న దృశ్యం

వై.రామవరం, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): మండలంలో ఆదివారం పలు గ్రామాల్లో అడవి రాజుల బాబు పండుగ ఘనంగా నిర్వహించా రు. ఆదివారాజులబాబుకు మామిడి చెట్టుకింద నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకు న్నారు. మాంసపు వంటకాలతో సహపంక్తి భోజనాలు చేసి సందడి చేశారు. గిరిజన గ్రామాల్లో ప్రతీ ఏటా ఆదివిరాజుల బాబుకు మొక్కులు చెల్లించు కోవడం ఆనవాయితీ. ప్రాంతాల్లో జీవనయాన సాగి స్తున్న తమను కాచికాపాడాలంటూ రాజులబా బును వేడుకోవడం పరిపాటిగా మారింది.

పాపికొండలకు పర్యాటకుల సందడి

దేవీపట్నం, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): తెలుగు రాష్ట్రాల నలుమూలల నుంచి ప్రకృతి ప్రేమికులు పాపికొండల విహారయాత్రకు ఆదివారం సుమారు ఐదు బోట్లలో 330మంది పర్యాటకులు తరలి వెళ్లారు. మండల పరిధిలో పోశమ్మగండి బోటు పాయింట్ నుంచి గోదావరి పరివాహక ప్రాంతాలైన పూడి పల్లి, తొయ్యేరు, దేవీపట్నం, మంటూరు, తాళ్లూరు, కచ్చులూరు తదితర గ్రామాల మీదుగా పేరంటా లపల్లి వెళ్లి సందడి చేశారు. ముందుగా మాత్మణి గండిపోశమ్మ అమ్మవారిని దర్శించుకుని అనంతరం బయలుదేరి వెళ్లారు.

లోవ తల్లి శరణు..శరణు..

లోవలో భక్తుల కోలాహలం

ఆలయానికి రూ.2.39లక్షల ఆదాయం

తునిరూరల్, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): తూర్పు కనుమల్లో కొలువై భక్తుల ఆరాధ్య దైవంగా పూజలు అందుకుంటున్న తలుపులమ్మ లోవ దేవస్థానానికి ఆదివారం భక్తులు పోటె త్తారు. అమ్మవారి దర్శనం కోసం తెలుగు రాష్ట్రాల నలుమూలల నుంచి వేకువజామునే లోవకు తరలిరావడంతో ఆలయ ప్రాంగణం భక్తులతో కోలాహలంగా మారింది. ప్రత్యేక క్యూలైన్లలో భక్తులు బారులు తీరి అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. కుటుంబ సమేతంగా లోవకు తరలివచ్చిన భక్తు లు ఆలయ ప్రాంగణం సమీపంలో వంట వార్పులు చేసుకుని భోజనాలు చేశారు. ఆదివారం ఒక్కరోజే ఆలయంలో వివిధ విభా గాల ద్వారా ఆలయానికి రూ.2.39లక్షల ఆదా యం సమకూరినట్లు ఆలయ ఈవో విశ్వనాథ రాజు తెలిపారు. భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక ఏర్పాట్లు చేసి తీర్థ, ప్రసాదాలు అందించినట్లు ఆయన వెల్లడించారు.



తలుపులమ్మ అమ్మవారు



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

ఆసుపత్రిలో స్వచ్ఛాంధ్ర



ఆసుపత్రి ఆవరణను శుభ్రం చేస్తున్న సిబ్బంది

రౌతులపూడి, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): స్వచ్ఛాంధ్రలో భాగంగా రౌతులపూడి సామాజిక ఆసుపత్రి ఆవరణను ఆదివారం సిబ్బంది శుభ్రం చేశారు. వైద్యులు, నర్సులతో సహా మిగిలిన సిబ్బంది ఆసుపత్రితో పాటు, ఆవరణ పరిసరాలను శుభ్రం చేశారు.

వాజపేయికి నివాళి

ఏలేశ్వరం, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): మాజీ ప్రధాని వాజపేయి శత జయంత్యు త్సవాలను గ్రామాల్లో నిర్వహించారు. సిరి పురం గ్రామంలో ఆదివారం బీజేపీ నాయకు ల నేతృత్వంలో పలువురు వాజపేయి సేవలను కొనియాడారు. బీజేపీ జిల్లా కా ర్యదర్శి కొల్లా శ్రీనివాస్‌ను బీజేపీ నాయకులు కంద వీరాస్వామి, గున్నాబత్తుల రాజబాబు, మణికంఠ, నూకరాజు, వెంకటలక్ష్మి, రామతు లసి, లక్ష్మీ గాయత్రి సత్కరించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కోటనందూరు, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): కోటనందూరు విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో చెట్లుకొమ్మలు తొలగింపు, విద్యుత్ లైన్ల మర మ్మతులు చేపడుతున్నందున సోమవారం విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ బి.వీరభద్ర రావు తెలిపారు. ఉదయం 8 నుంచి మధ్యా హ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు.

పేకాట శిబిరాలపై దాడులు..

19మంది అరెస్ట్

పెద్దాపురం/ సామర్లకోట, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి):పెద్దాపురం పోలీస్‌స్టేషన్ పరిధి లో చిన్నబ్రహ్మదేవం, జగ్గన్నపేటమ్మపురం, పులి మేరు గ్రామాల్లో పెద్దాపురం ఎస్ఐ మౌనిక ఆధ్వర్యంలో ఆదివారం తన సిబ్బంది దితో కలిసి పేకాట శిబిరాలపై దాడులు నిర్వహిం చారు. 19మందిని అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.87,750 నగదును స్వాధీనం చేసుకు న్నారు. మరో 4మోటార్ సైకిళ్లను స్వాధీనం చేసుకున్నారు. చిన్నబ్ర హ్మదేవంలో పేకాడు తున్న ఎనిమిదిని నుంచి రూ.13,800, జగ్గన్న తిమ్మాపురంలో పామాయిల్‌తోటలో పేకాడు తున్న 8మంది నుంచి రూ.68,700నగదు, 4మోటార్ సైకిళ్లను స్వాధీ నం చేసుకున్నారు. చదలా డలో పేకాడు తున్న నలుగురిని అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.5,250 స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు.

వేట్లపాలెంలో

14మంది అరెస్ట్

సామర్లకోట, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని వేట్లపాలెంలో ఒక పంక్షన్ హాలు నందు పేకాట శిబిరంపై దాడులు తెలవారుజామున సామర్లకోట సీఐ ఏ.కృష్ణ భగవాన్ ఆధ్వర్యంలో పోలీసులు దాడులు నిర్వహించారు. పేకాడుతున్న 14మందిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.1,21,050 స్వాధీనం చేసుకున్నారు. సోమ వారం కోర్టులో హాజరుపర్చనున్నారు.

రిక్షా ఇచ్చారు...చార్జర్ ఇవ్వలేదు!

ఐదు నెలలుగా ఎంపీడీవో కార్యాలయం చుట్టూ తిరుగుతున్న దివ్యాంగులు

రౌతులపూడి, ఫిబ్రవరి16(ఆంధ్రజ్యోతి): గిడ జాం గ్రామంలో ఆయిదు నెలల క్రితం దివ్యాం గులైన గొల్లు అచ్చారావు, తుంపల సత్యనార యణ, జల్లప సత్తిబాబులకు ప్రభుత్వం చార్జింగ్ రిక్షాలను ప్రతిపాడు ఎమ్మెల్యే ఎంపీడీవో కార్యా లయంలో పంపిణీ చేశారు. రిక్షాలు కొద్ది రోజుల వరకు బాగానే ఉన్నా, ఆ తర్వాత చార్జింగ్ అయిపోవడంతో దివ్యాంగులు బయట కురాలేని పరిస్థితి నెలకొంది. చార్జర్ కోసం ఐదు నెలలుగా రౌతులపూడి ఎంపీడీవో కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు. చివరకు అధి కారులు చార్జర్ మీరే కొనుగోలు చేసుకోవాలని చెప్ప డంతో లబోదిబోమంటున్నారు. చార్జర్ ఖరీదు రూ.6వేలు వరకు ఉంటుందని, అంత సొమ్ము చెల్లించి కొనుగోలు చేయలేమని, ఉన్నతాధి కారులు స్పందించి చార్జర్లు ఉచితంగా ఇప్పిం చాలని దివ్యాంగులు కోరుతున్నారు.



చార్జర్ ఇప్పించాలని కోరుతున్న దివ్యాంగులు

ఇరిపాకలో నేడు శివ, కేశవుల విగ్రహాల ప్రతిష్ఠ



పూజలు చేస్తున్న జ్యోతుల నవీన్ దంపతులు

జగ్గంపేట, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): ఇరి పాకలో ఏలేరు నదీ తీరాన శివకేశవుల ఆల యం వద్ద సోమవారం ఉదయం శివ కేశవుల ప్రతిష్ఠ జరగనుంది. దీనికి వివిధ మఠాల స్వామీజీలు, టీటీడీ పాలకమండలి సభ్యులు తదితరులు రానున్నారు. ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ, మణి దంప తులు, జ్యోతుల నవీన్, లక్ష్మీదేవి దంప తులు, శేష నర్సానాయుడు, సునీత ఆదివారం ఐదో రోజు పూజాకార్యక్రమాలు నిర్వహించారు. కొట్ర వెంకట సూర్యనారాయణ శ్వర శర్మ ఆధ్వర్యంలో విఘ్నేశ్వర పూజ, పుణ్య హ వచనం, కోటిలింగేశ్వరస్వామికి పూజ, అరుణహోమం, పరివార దేవత హోమాలు తదితర పూజలు నిర్వహించారు. విశ్వనాథ న్ కుమార్ ఆధ్వర్యంలో పూజలు జరిగాయి.

తునిలో ఏకకాలంలో పోలీసుల విస్తృత తనిఖీలు

తుని రూరల్, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): ఎస్పీ జి.బిందు మాధవ్ ఆదేశాలతో తుని పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో రూరల్ సీఐ చెన్న కేశవరావు, తుని పట్టణ ఎస్ఐ గీతారామకృష్ణలు 50మంది సిబ్బందితో ఏకకాలంలో విస్తృత తని ఖీలు చేపట్టారు. రికార్డులు లేకపోవడంతో పలువాహనాలను స్టేషన్‌కు తరలిం చారు. కొందరు వాహ నాల యజమా నులకు జరిమానా విధిం చారు. అలాగే పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో వివిధ లాడ్జిల్లో తనిఖీలు నిర్వహించి నిర్వాహ కులకు పలుసూచనలు ఇచ్చారు. ఈప్రత్యేక డ్రైవ్‌లో తుని పట్టణ, పోలీస్‌స్టేషన్ ఎస్ఐలు, ఏఎస్ఐలు, కానిస్టేబుల్స్ పాల్గొన్నారు.



వాహనాలు తనిఖీ చేస్తున్న సీఐ చెన్నకేశవరావు

యర్రవరంలో ఎమ్మెల్యే ఎన్నికల ప్రచారం



యర్రవరంలో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో కరపత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే

ఏలేశ్వరం, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): పట్టభ ద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో ఆదివారం ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్య ప్రభ ఇంటింటి ప్రచారం చేశారు. ఎమ్మెల్సీ కూటమి అభ్యర్థి రాజశేఖ ర్‌కు మొదటి ప్రాధాన్యతా ఓటువేసి గెలిపించాలని అభ్యర్థించారు. యర్రవరం గ్రామంలో ఓటర్లను కలిసి కరపత్రాలు పంచారు. ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి, టీడీపీ నాయకులు బస్వా ప్రసాద్, మైరాల కనకారావు, టీడీపీ పట్టణ శాఖ మూది నారాయ ణస్వామి, కౌన్సిలర్ బొదిరెడ్డి గోపి, కూటమి నాయకులు పాల్గొన్నారు.

సత్యదేవ నిత్యాన్నదాన పథకానికి రూ.లక్ష విరాళం

అన్నవరం, ఫిబ్రవరి 16(ఆంధ్ర జ్యోతి): అన్నవరం దేవస్థానం నిత్యాన్నదాన పథకానికి ఆదివారం అమలాపురానికి చెందిన వేటుకూరి శ్రీరామరాజు రూ.1,11,521 విరాళం ఇచ్చారు. ఆలయ ఈవో వీర్ల సుబ్బా రావుకు దాత అందించగా వారికి స్వామివారి ప్రసాదం, ప్రత్యేక ద ర్శనం కల్పించారు.



ఈవో సుబ్బారావుకు విరాళం అందిస్తున్న దాత

విద్యార్థుల సరస్వతీ పూజ

అన్నవరం, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): త్వరలో జరిగే పబ్లిక్ పరీక్షల నేపథ్యంలో విద్యార్థులు ఉత్తమశ్రేణిలో ఉత్తీర్ణత సాధిం చాలని ఆకాంక్షిస్తూ అన్నవరం దేవస్థా నంలో ఈనెల28న ఉదయం 9గంటలకు సరస్వతీ పూజ నిర్వహించనున్నట్లు ఆల య అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. సరస్వతీ పూజల అనంతరం విద్యార్థులకు సత్యదేవుడు ఆశీస్సులతో కూడిన పెన్ను లను అందిస్తామన్నారు. ఈ పూజల్లో విద్యార్థులంతా పాల్గొనాలని వారు కోరారు.

యువకుడి డాక్యుమెంట్ల బ్యాగ్ రైలులో మిస్సింగ్

అన్నవరం, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): భువనేశ్వర్ నుంచి బెంగళూరు ఉద్యో గంలో చేరేందుకు వెళుతున్న యువకుడి బ్యాగ్ అన్నవరం రైల్వేస్టేషన్‌లో పెళ్లి బృందం లగేజీలో కలిసి పోయింది. దీంతో ఆ యువకుడు ఆందోళన చెందుతూ రైల్వే పోలీసులకు సమాచారం ఇచ్చాడు. రైల్వే జీఆర్పీ శ్యామ్ దీనిపై విచారణ చేసి బ్యాగ్‌ను యువకుడికి అందించారు. ఉద్యోగ నియామక పత్రంతో పాటు డాక్యుమెంట్లు బ్యాగ్‌లో ఉన్నాయి.

జానపద వృత్తి కళాకారుల సమస్యలపై ఎమ్మెల్యేకు వినతి

జగ్గంపేట, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): ఇరిపాక శివకేశవుల ఆలయం వద్ద టీటీడీ పాలకమండలి సభ్యులు, ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూను జానపద వృత్తి కళాకా రుల సంఘం, హిందూ ధర్మప్రచార భజన కళాకారుల ఆధ్వర్యంలో కలిసి సమస్యలపై వినతిపత్రం ఇచ్చారు. గంగవరం మండల అధ్యక్షుడు సత్యనారాయణ, తొండంగి మం డలం అధ్యక్షుడు కె.వీర వెంకట సత్యనారా యణ, రామచంద్రపురం మండల అధ్య క్షులు బుల్లెబ్బాయి, కాజులూరు మండల అధ్యక్షులు త్రిమూర్తులు, గరగా బాబూరావు, భీముడు, ఎం.అరుణ పాల్గొన్నారు.

వేడుకగా సత్యదేవుడి ఆర్జిత రథ సేవ

అన్నవరం, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): సత్యదేవుడి సన్నిధిలో వారాంతపు ఆర్జిత సేవ రథోత్సవాన్ని ఆదివారం వేడుకగా జరి గింది. ఉదయం 10గంటలకు స్వామి, ఆ మ్మవార్లను ప్రధానాలయం నుంచి చిన్న లేటు రథం వద్దకు తీసుకుని వచ్చారు. వేదపండితుల ప్రత్యేక పూజల అనంతరం మూడుసార్లు తూర్పురాజగోపురం చుట్టూ ప్రదక్షిణ జరిపారు. కార్యక్రమంలో ఈవో సుబ్బారావు కుటుంబ సభ్యులు, సహాయ కమిషనర్ ఎల్.రామకృష్ణ, పి.ఆర్.ఓ.ల ఈవోలు, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ ఎం.గణపతి రావు తదితరులు పాల్గొన్నారు.

గ్రావెల్ అక్రమ తవ్వకాలపై పోలీసుల దాడి

గొల్లప్రోలు రూరల్, ఫిబ్రవరి 16(ఆంధ్ర జ్యోతి): గ్రావెల్ అక్రమ తవ్వకాలపై పోలీ సులు దాడులు నిర్వహించి ట్రాక్టర్‌ను సీజ్ చేశారు. గొల్లప్రోలు మండలం చెందుర్తి శివా రు పోలవరం-పుష్కర కాలువ గట్టుపై ఉన్న గ్రావెల్‌ను జేసీబీతో తవ్వి అక్రమంగా తరలిస్తున్నారన్న సమాచా రంతో ఆదివారం తెల్లవారుజామున ఎస్ఐ ఎన్.రామకృష్ణ ఆధ్వర్యంలో పోలీసులు దాడులు నిర్వహించారు. ట్రాక్టర్‌ను ఆపి స్వాధీనం చేసుకున్నారు. తవ్వకాలు జరిగే ప్రాంతం వద్దకు వెళ్లగా జేసీబీతో వ్యక్తి పరా రయ్యారు. సంఘటనకు సంబంధించి ట్రాక్టర్ డ్రైవర్ కొరుమిల్లి సురేష్, జేసీబీ డ్రైవర్ వాసా రాజుపై కేసు నమోదు చేశారు. ట్రాక్టర్‌ను పోలీసుస్టేషన్‌కు తరలిం చారు. గొల్లప్రోలు ఎస్ఐ రామకృష్ణ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

'క్రీడల పట్ల మక్కువ పెంచుకోవాలి'

కాకినాడసిటీ, ఫిబ్రవరి16(ఆంధ్ర జ్యోతి): విద్యార్థులు చదువుతో పాటు క్రీడల పట్ల మక్కువ పెంచుకోవాలని బాష్యం స్కూల్ జోనల్ ఇన్‌చార్జ్ గోవింద రాజులు పేర్కొ న్నారు. స్థానిక శాంతినగర్ బాష్యం స్కూ ల్‌లో ఆదివారం కాకినాడ జిల్లా సెకండ్ ఓపెన్ టైక్వాండో ఛాంపి యన్‌షిప్-2025 పోటీలు జరిగాయి. తూర్పు గోదావరి జిల్లా టైక్వాండో అసోసియేషన్ ఆధ్వర్యంలో సబ్‌జూనియర్, కేడెట్ జూనియర్స్ కేట గిరిలలో నిర్వహించిన పోటీల్లో 216మంది పాల్గొన్నారు. ముఖ్యఅతిథిగా రాష్ట్రవైద్య ఆరోగ్య మౌలిక సదుపాయాల సంస్థ మాజీ చైర్మన్ చలమలశెట్టి రవి, ప్రత్యేక అతిథిగా వ్యాపారవేత్త పెంకే రాజు హాజరై పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. జిల్లా టైక్వాండో అసోసియేషన్ అధ్యక్షుడు రాయుడు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

గ్యాస్ వాటా కోసం ఉద్యమించాలి

సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు



కాకినాడలో సమావేశంలో మాట్లాడుతున్న ముప్పాళ్ల నాగేశ్వరరావు, నాయకులు

కాకినాడ సిటీ, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): మన గ్యాస్, మన చమురు వనరులపై ఏపీ ప్రజల హక్కుగా కాపాడుకోవాలని కోరుతూ ఈ నెల 23న కాకినాడలో జరిగే సదస్సును విజయ వంతం చేయాలని సీపీఐ రాష్ట్ర సహాయ కార్య దర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక ఎన్జీవో భవన్‌లో సీపీఐ ఆధ్వర్యాన విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ముప్పాళ్ల మాట్లాడుతూ అపారమైన సహజ వనరులు న్న రాష్ట్రం అభి వృద్ధి సాధించడానికి గ్యాస్ వాటా కోసం అం దరూ ఉద్యమించాలన్నారు. కాకినాడ సముద్ర తీరంలో ఏర్పడిన చమురు గ్యాస్ నిక్షేపాలు, మ న గ్యాస్ మనకే దక్కాలని గ్యాస్ వాటా కోసం అన్ని రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు ఏక మై పోరాటం చేయాలన్నారు. ఆంధ్ర ప్రాంతానికి న్యాయమైన గ్యాస్ కేటాయింపుల కోసం, 50 శాతం లాభం వాటా కోసం వామపక్షాలు, ప్రజాస్వామికవాదులు కృషి చేయాలన్నారు. ఈ విషయమై ఏపీ శాసనసభ, శాసన మండలి ఏక గ్రీవ తీర్మానాలు చేసినా గ్యాస్ కేటాయింపులు, ఆదాయంలో నగదు వాటా పొందలేకపోతున్నా మన్నారు. మన దేశంలో ముంబయి కన్నా మన గోదావరి బేసిన్‌లో ఎక్కువ గ్యాస్ నిల్వలు ఉన్నాయన్నారు. దీనిపై 23న తలపెట్టిన సద స్సులో ఉపాధ్యాయులు, విద్యార్థులు, కార్మికులు, రైతులు, అన్ని వర్గాల ప్రజలు పాల్గొనాలని కోరారు. సీపీఐ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు తాటిపాక మధు, సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు డేగ ప్రభాకర్ మాట్లాడుతూ మన తీర ప్రాంతంలో ఉన్న సహజ వనరు లను పాలకులు బడా కార్పొరేట్ కంపెనీలకు దోచిపెడు తున్నారని విమర్శించారు. అనంతరం ప్రజా సంఘాల నాయకులు, విద్యావేత్తలతో సమావేశం నిర్వహి ంచారు. సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు తాటిపాక మధు, కాకినాడ జిల్లా కార్యదర్శి కె.బోడ కొండ, బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కార్య దర్శి కె.సత్తిబాబు, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి తోకల ప్రసాద్, విద్యావేత్తలు అలపా టి శ్రీనివాస్, కె.ఆదినారాయణమూర్తి, చింతపల్లి సుబ్బారావు పాల్గొన్నారు.